అనుదినం... జనస్వరం

ఆదిలాబాద్, నిర్మల్

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

విద్య ప్రత్యేక సంచిక

12 పేజీలు | శనివారం 22 జూన్ 2024 | www.navatelangana.com





- అమ్మ ఆదర్శం పేరిట ఆధునిక సౌకర్యాలు
- ఉమ్మడి జిల్లాలో పూర్తికావచ్చిన పనులు
- గురుకులాలు, కేజీబీవీలతో నాణ్యమైన చదువు
- పాఠ్య, నోటు పుస్తకాలు ఉచితంగా పంపిణీ
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రయోజనం

సర్కారు బడి..నూతన ఒరవడి..!




ఒకప్పుడు సౌకర్యాల లేమితో కూనరిల్లిన సర్కారు బడులు తాజాగా ఆధునికత సంతరించుకుంటున్నాయి. ప్రయివేటు, కార్పొరేట్ బడులను తలదన్నేలా మౌళిక వసతులు కల్పిస్తున్నారు. తాగునీటి నుంచి టాయిలెట్ల వరకు విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు గత ప్రభుత్వం మనఊరు- మనబడి పేరిట చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కొత్త ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట ఆధునిక సౌకర్యాలు కల్పిస్తోంది. తాజాగా విడతల వారీగా కాకుండా ఒకే సారి బడులన్నింటిలోనూ ఆయా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి నిధులను సైతం విడుదల చేసింది. వీటి నిర్వహణ..పర్యవేక్షణ బాధ్యతను గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కు అప్పగించింది. తాజాగా ఉమ్మడి జిల్లాలో పనులను 80శాతం వరకు పూర్తికాగా.. మిగిలిన వాటిని కొనసాగుతున్నాయి.


నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సర్కారు బడి పేరు చెప్పగానే సౌకర్యాలు బాగుండవని జనాల్లో ఓ అపోహ ఉంది. విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గేందుకు ఇది కూడా ఓ కారణమని భావిస్తుంటారు. కానీ ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలతో సర్కారు బడులకు కూడా మంచి రోజులొస్తున్నాయి. గత ప్రభుత్వం మన ఊరు- మనబడి పేరిట 12 రకాల సౌకర్యాలకు ప్రతిపాధనలు రూపొందించి పనులు ప్రారంభించింది. మూడేండ్లలో జిల్లోలోని బడులన్నింటిలోనూ మౌళిక వసతులు కల్పించాలని భావించింది. ఇందుకు ఏటా 25శాతం బడులను ఎంపిక చేసి పనులు ప్రారంభించింది. కానీ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. తాజాగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో వీటిపై ఫోకస్ పెట్టింది. అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట పేరు మార్పిడి చేయడంతో పాటు ఒకే విడతలో బడులన్నింటిలోనూ ఈ సౌకర్యాలు కల్పించాలని అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఇందుకు ప్రత్యేకంగా నియోజకవర్గ అభివృద్ధినిధులు(ఎస్‌డీఎఫ్) నుంచి ప్రత్యేకంగా బడులకు కేటాయించారు. పనులు ప్రారంభించేందుకు

మిగతా..6లో...







ఉపాధ్యాయుల కృషితో వందశాతం ఫలితాలు సాధిస్తాం..

● ఎంఈఓ భూమారెడ్డి

నవతెలంగాణ-బోథ్



రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటోందని ఎంఈఓ భూమారెడ్డి విద్యారంగా ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తూ, పాఠశాలలు అప్ గ్రేడ్ చేసి, ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టడం జరుగుతుందని అన్నారు. మండలంలోని ప్రతి పాఠశాలలో అదనపు గదులు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, విద్యుత్, విద్యార్థులకు మంచి భోజనాన్ని అందించడం జరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలను హంగులతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా రూపుదిద్దుతున్నామని అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు సాధించామని అన్నారు. మండలంలోని ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలలు 43, జిల్లా పరిషత్ పాఠశాలలు 9, ఐటీడీఏకు సంబంధించిన పాఠశాలలు 27, ఐటీడీఏ ప్రైమరి నాలుగు ఆశ్రమ ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో 4,800 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారని అన్నారు. ప్రయివేటు పాఠశాలలు 10 ఉన్నాయన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించామని అన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు మోడల్ స్కూల్

● కళాశాల ప్రిన్సిపాల్ ఉమేష్

నవతెలంగాణ-బోథ్



క్రమశిక్షణకు మారుపేరుగా ఆదర్శ మాడల్ స్కూల్ గత 12 సంవత్సరాల నుంచి విద్యను అందిస్తూ, ఎందరో విద్యార్థులు ఉన్నతంగా తీర్చిదిద్దుతోందని కళాశాల ప్రిన్సిపల్ ఉమేష్ విద్యారంగ ప్రత్యేక సంచిక సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి, వివిధ ఉద్యోగాలు సాధించారని అన్నారు. ప్రతి విద్యా సంవత్సరం పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధిస్తున్నామని అన్నారు. పాఠశాలలో విద్యా బోధనతో పాటు సంస్కృతిక కార్యక్రమాలు క్రీడలు ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా పిల్లలకు సృజనాత్మకంగా, ల్యాబ్ యాక్టివిటీస్, కంప్యూటర్ నాలెడ్జ్, డిజిటల్ క్లాసులపై దృష్టి సారిస్తున్నారు. అదేవిధంగా పాఠశాల నుంచి ఎందరో విద్యార్థులు ఉన్నత చదువులు ఐఐటీలు ఆయా గ్రూపులలో ఎంపికై ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఇప్పటికీ పాఠశాలలో క్రమశిక్షణతో ప్రతి విద్యార్థిని విద్యార్థులకు విద్యాబోధన క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.



ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య

● జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతాం ● డీఈఓ డా.రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

గత రెండు సంవత్సరాలుగా పది పరీక్షల్లో రాష్ట్రంలోని నిర్మల్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుతున్నామని, మరోసారి మొదటి స్థానంలో నిలుపుతామని, జిల్లా విద్యాశాఖ అధికారి డా.రవీందర్‌రెడ్డి విద్యారంగా ప్రత్యేక సంచిక సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 1024 పాఠశాలలు ఉన్నాయని, అందులో 756 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 50 వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారని తెలిపారు. మరి కొన్ని రోజుల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని వెల్లడించారు. ముఖ్యంగా బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా జిల్లాలో ప్రచారం చేశామన్నారు. జిల్లాలో 608 అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాలల ఎంపిక చేసామన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు. ఇతర పనులు చేపట్టామన్నారు. దీనికోసం రూ.20కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని వెల్లడించారు. ఇప్పటివరకు 310 పాఠశాలలో పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా పాఠశాలలో పనులు పురోగతిలో ఉన్నాయని త్వరలో



పూర్తయితాయని తెలిపారు. ఇప్పటివరకు రూ.6 కోట్లు నిధులు ఖర్చు చేశామని తెలిపారు. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ జిల్లాకు వచ్చాయని పలు పాఠశాలల్లో పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన చదువు అందించేందుకు ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన పాఠశాలలపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. జిల్లాలో ఏకోపాధ్యాయ, ఇద్దరు ఉపాధ్యాయుల ఉన్న పాఠశాలలు ఉన్నాయని, విద్యార్థులకు బోధనకు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రేడ్ 2, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎస్జీటి పదోన్నతులపై దృష్టి సారించామని వెల్లడించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో నిర్మల్ జిల్లా మరోసారి పది పరీక్షల్లో రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుతామని ఆకాంక్షిస్తున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు.

పుస్తకాలతో పాటు యూనిఫామ్‌లు అందజేస్తున్నాం

● ఎంఈఓ శ్రీకాంత్

నవతెలంగాణ-తాంసి

ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలతో పాటు యూనిఫాంలు అందజేస్తున్నామని ఎంఈఓ శ్రీకాంత్ అన్నారు. విద్యారంగా ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. తాంసి, భీంపూర్ మండలాల విద్యా వ్యవస్థ బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. తాంసి మండలంలో ప్రాథమిక పాఠశాలలు-4, ప్రాథమిక పాఠశాలలు-7, గిరిజన ఆశ్రమ పాఠశాలలు-3, యూపీఎస్ పాఠశాలలు-5 ఉన్నాయి. వీటిలో మొత్తం విద్యార్థుల 2 వేల 56 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. భీంపూర్ మండలంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలు-14, గిరిజన పాఠశాలలు-16 యూపీఎస్ పాఠశాల-9, మొత్తం విద్యార్థులు 2,595 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలతో పాటు యూనిఫామ్ అందించడం జరుగుతుంది. అమ్మ ఆదర్శ పాఠశాలల ఆధునీకరణకు టాయిలెట్ల నిర్మాణాలకు తాంసి మండలంలోని పాఠశాలకు రూ.89 లక్షల 65 వేల నిధులు మంజూరు అయినట్టు తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కొనసాగడం, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జావా సరఫరా చేయడానికి ముందుకు వచ్చింది. విద్యార్థులకు ప్రతిరోజు జావా అందిస్తామన్నారు. అన్ని పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. గత సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ప్రతిభతో ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక ఉపాధ్యాయులు పనిచేయడం జరుగుతుందన్నారు. ప్రయివేట్ పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన అందిస్తున్నామని అన్నారు.



ప్రాథమిక స్థాయిలోనే నాణ్యమైన విద్య

● నూతన బోధన విధానమే ఏస్ స్కూల్ ప్రత్యేకత



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ప్రాథమిక స్థాయిలో అందే నాణ్యమైన విద్యాభోదనే విద్యార్థుల భవితవ్యానికి బాటలు వేస్తుందని ప్రిన్సిపల్ వెంకటేష్ అన్నారు. విద్యారంగా ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. పిల్లల తల్లిదండ్రులు సైతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాఠశాల ఎంపిక చేసుకోవడం ఎంతో అవసరం. ప్రాథమిక స్థాయిలోనే మంచి విద్యను అందించే పాఠశాలను గుర్తించి, అందులో చేర్పిస్తే విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో పాత తరహా విద్యా విధానంతో పిల్లలకు ఎలాంటి ప్రయోజనం లేదని గ్రహించిన పట్టణంలోని 'ఏస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్'లో నూతన భోధన పద్ధతులతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీస్తున్నారు. ప్రత్యేక శిక్షణపొందిన వారిచే విద్యార్థులకు రోబోటిక్, కోడింగ్ విధానంతో పాఠాలు నేర్పిస్తున్నాం. విద్యార్థులు నిర్భయంగా ఇంగ్లీష్‌లో మాట్లాడేలా స్పోకెన్ ఇంగ్లీష్, సెమినార్, డిబెట్స్ నిర్వహిస్తున్నాం. నవోదయ, గురుకులం, సైనిక్, మాడల్ స్కూల్స్ ప్రవేశాలకోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. 2024-25 విద్యా సంవత్సరంలో 7 మంది విద్యార్థులు గురుకులాల్లో సీట్లు సాధించడం గమనార్హం. నర్సరీ నుంచి టెన్త్ క్లాస్ వరకు ఉన్న ఏస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంచి భోదనతో పాటు ఫైర్ సేఫ్టీ సైతం ఉండటంతో పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. పిల్లలను పాఠశాలలో చేర్పించడంలో ప్రధానంగా వారి తల్లిదండ్రులు విద్యాసంస్థలపై అవగాహన కలిగి ఉండాలి. ప్రచారాన్ని గుడ్డిగా నమ్మి చేర్పించవద్దు. పాఠశాలలో చేస్తున్న భోదన విధానం, అందులో సౌకర్యాలు, పాఠాలు చెప్పే ఉపాధ్యాయుల సామర్థ్యం పూర్తిగా తెలుసుకొని పాఠశాలలో చేర్పించడం మంచిది.



బాధితుడికి అండగా జైజవాన్ జైకిసాన్ ఫౌండేషన్ సభ్యులు



నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబంలో జన్మించిన గుండ విజయ్ చిన్నప్పుడే తండ్రిని కోల్పోయాడు. ఇటీవల తల్లి గొంతు క్యాన్సర్‌తో మృతి చెందగా విషయం తెలుసుకున్న జైజవాన్ జైకిసాన్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం వారి స్వగృహానికి వెళ్లి రూ.3200 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబారిపేట్ ఎంపీటీసీ కట్ల సింధుజ సాగర్, వార్డ్ మెంబర్ సదువుల రాజేష్, రాజు, అంజి, మల్లేష్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-నార్నూర్

యోగాతోనే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని ఏపీఓ జాదవ్ సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాన్యాపూర్ గ్రామ పంచాయతీలో జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కూలీలతో కలిసి యోగా ఆసనాలు వేశారు. రోజూ యోగా చేయడం వల్ల మనిషికి వ్యాధులు దరి చేరకుండా మానసిక ఉల్లాసంగా ఉంటారని అవగాహన కల్పించారు. అనంతరం ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలని సూచించారు. కార్యక్రమంలో టీఏ వికాస్ చౌహాన్, ఫీల్డ్ అసిస్టెంట్, పలువురు కూలీలు పాల్గొన్నారు.

ఇంటర్‌లో మెరిసిన ఫలితం..!

- రాష్ట్రంలో కుమురంభీం జిల్లాకు ఏడో స్థానం
- వరుసగా12, 13వ స్థానాల్లో నిర్మల్, ఆదిలాబాద్
- 30వ స్థానానికి పరిమితమైన మంచిర్యాల
- ఈ నాలుగు జిల్లాల్లోనూ బాలికలదే పైచేయి



రాష్ట్రంలో వెలువడిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో జిల్లాలో మిశ్రమ ఫలితాలు వెలువడ్డాయి. గతం కంటే కొన్ని స్థానాలు దిగజారిపోయినప్పటికీ.. ఉత్తీర్ణత శాతంలో మాత్రం విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబర్చారు. ఉమ్మడి జిల్లాలో సాధారణ విభాగంలో 23,262 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 15,242మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 3723మంది పరీక్ష రాయగా 2503 మంది పాసయ్యారు. ప్రథమ సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 24,043మంది పరీక్ష రాయగా 13,622 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 4059మంది పరీక్ష రాయగా 2206మంది ఉత్తీర్ణులు కావడం విశేషం.

- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ద్వితీయ సంవత్సరంలో 4095మంది పరీక్ష రాయగా 2951మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 1929మంది రాయగా 1176మంది పాసయ్యారు. బాలికలు 2166మంది రాయగా 1775మంది ఉత్తీర్ణులయ్యారు. 72.06 శాతంతో రాష్ట్రంలో ఏడో స్థానంలో నిలిచింది. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో జిల్లావ్యాప్తంగా 662మంది పరీక్ష రాయగా 526మంది ఉత్తీర్ణులయ్యారు.
- ప్రథమ సంవత్సరంలో 4570మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2813 మంది పాసయ్యారు. ఇందులో బాలురు 2097మంది రాయగా 982మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 2473మంది పరీక్ష రాయగా 1831మంది ఉత్తీర్ణతతో 61.55శాతం సాధించారు. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 853 మంది పరీక్ష రాయగా 480మంది పాసయ్యారు.
- నిర్మల్ జిల్లాలో ద్వితీయ సంవత్సరంలో 5475మంది పరీక్ష రాయగా 3624మంది పాసయ్యారు. ఇందులో బాలురు 2469మంది పరీక్షకు హాజరుకాగా 1313మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 3008మంది హాజరు కాగా 2311మంది ఉత్తీర్ణులవగా 66.17శాతంతో రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచింది. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో జిల్లాలో 962 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 572మంది ఉత్తీర్ణులయ్యారు.
- ప్రథమ సంవత్సరంలో 5465మంది పరీక్ష రాయగా 3064మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 2447మంది హాజరుకాగా 990మంది పాసయ్యారు. బాలికలు 3020మంది పరీక్ష రాయగా 2074మంది ఉత్తీర్ణతతో 56.05శాతం సాధించారు. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 1072మంది విద్యార్థులు పరీక్ష రాయగా 497మంది ఉత్తీర్ణులయ్యారు.
- ఆదిలాబాద్ జిల్లాలో ద్వితీమ సంవత్సరంలో 8320మంది పరీక్ష రాయగా 5470మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 4114 మంది పరీక్ష రాయగా 2321మంది పాసయ్యారు. బాలికలు 4206మంది పరీక్షకు హాజరుకాగా 3149మంది ఉత్తీర్ణతతో 65.75శాతంతో రాష్ట్రంలో 13వ స్థానంలో నిలిచింది. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో జిల్లాలో 989మంది రాయగా 695మంది పాసయ్యారు.
- ప్రథమ సంవత్సరంలో 8551మంది పరీక్ష రాయగా 5220మంది పాసయ్యారు. ఇందులో బాలురు 4238మంది పరీక్ష రాయగా 2194 మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 4313మంది పరీక్షకు హాజరుకాగా 3026మంది ఉత్తీర్ణులుయ్యారు. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 1026మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 640మంది పాసయ్యారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు ఫర్వాలేదనిపించారు. గతంలో రాష్ట్రంలో మిగతా జిల్లాల కంటే మెరుగైన స్థానాలు సాధించినా ఈ ఏడాది మాత్రం కాస్త వెనుకబడ్డాయి. కానీ మిగితా జిల్లాలతో పోల్చుకుంటే మాత్రం బాగానే సాధించాయి. గతేడాది ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తాజాగా ఏడో స్థానానికి పరిమితమైంది. మరోపక్క నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలు వరుసగా 12, 13వ స్థానాల్లో నిలిచాయి. కానీ మంచిర్యాల జిల్లా మాత్రం రాష్ట్రంలో 30వ స్థానానికి పడిపోయింది. కాగా ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లోనూ ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు వరుసగా 8, 9వ స్థానాల్లో నిలవగా నిర్మల్ జిల్లా 16వ స్థానంలో నిలిచింది.మంచిర్యాల జిల్లా మాత్రం 32వ స్థానంలో నిలవడం కొంత నిరాశకు గురిచేసింది. మరోపక్క ఈ నాలుగు జిల్లాల్లోనూ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బాలుర కంటే బాలికలే పై చేయి సాధించారు.

\- నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

- మంచిర్యాల జిల్లాలో ద్వితీయ సంవత్సరంలో 5370మంది పరీక్షలు రాయగా 3197మంది పాసయ్యారు. ఇందులో బాలురు 2451 మంది హాజరుకాగా 1189మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 2919మంది పరీక్ష రాయగా 2008మంది ఉత్తీర్ణతతో 59.53శాతం సాధించారు. రాష్ట్రంలో 30వ స్థానంలో నిలిచింది. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 1110మంది పరీక్ష రాయగా 710మంది ఉత్తీర్ణులయ్యారు.
- ప్రథమ సంవత్సరంలో 5455మంది పరీక్ష రాయగా 2525మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 2520 మంది పరీక్ష రాయా 858మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 2935 మంది పరీక్ష రాయగా 1667మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 1108మంది పరీక్ష రాయగా 589మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



నవతెలంగాణ-ఉట్నూర్

ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలలు ఆరు ఉన్నాయి. అందులో ఆశ్రమ బాలికల పాఠశాల నర్సాపూర్(బి)లో పదో తరగతిలో 97.2 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. ఆశ్రమ బాలికల పాఠశాల ఉట్నూర్‌లో పదో తరగతిలో 90.1శాతం, ఆశ్రమ బాలురు పాఠశాల ఉట్నూర్‌లో 92.9 శాతం, ఆశ్రమ బాలురు లక్షెట్టిపేట్ పాఠశాల 83.9 శాతం, ఆశ్రమ బాలురు యెంద పాఠశాల 80 శాతం, ఆశ్రమ బాలురు పాఠశాల హస్నాపూర్‌లో 48.9 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం..

ఏటీడీఓ క్రాంతి కుమార్



ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. 2024-25 విద్య సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవసరమైన శిక్షణలు ఇస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు కూడా మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

- జిల్లా ఇంటర్ బోర్డు అధికారి రవీందర్‌కుమార్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత నాణ్యమైన విద్యను అందిస్తున్నామని జిల్లా మాధ్యమిక విద్యాధికారి రవీందర్ కుమార్ అన్నారు. ఇంటర్మీడియట్ కళాశాలలో ప్రవేశాలను పెంచేందుకు మండలాల్లో, గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్య వ్యవస్థపై విద్యారంగా ప్రత్యేక సంచిక సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు.

నాణ్యమైన బోధన ప్రభుత్వ కళాశాలల్లోనే...

జిల్లాలో మొత్తం 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 19 ప్రయివేటు కళాశాలలు, 44 గవర్నమెంట్ సెక్టార్ కళాశాలలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 10వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన బోధన తీరు, సౌకర్యాలు, ఇటీవల సాధించిన ఫలితాలపై ప్రచారం చేయడం మూలంగా విద్యార్థులు సర్కారు కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందులో జిల్లాలో అన్ని కళాశాలల్లో సరిపడా భవనాలు, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉన్నాయి. ప్రస్తుతం రెగ్యులర్ అధ్యాపకులు ఉండగా అతిథి అధ్యాపకుల నియామకంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

అందుబాటులో ఉన్న భాషలు.. సౌకర్యాలు, లాభాలు..

ప్రభుత్వ కళాశాలలో వివిధ భాషల్లో మీడియంలో విద్య అందుబాటులో ఉంది. తెలుగు, ఇంగ్లీష్ మీడియం అన్ని కళాశాలలో అందుబాటులో ఉండగా, మరాఠీ మీడియం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో అందుబాటులో ఉంది. అలాగే ఉర్దూ మీడియం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో, బోథ్‌లోని ప్రభుత్వ కళాశాలలో అందుబాటులో ఉంది. విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ క్యాంపు, సాయంత్రం వేళ స్టడీ అవర్స్, పలు కల్చరల్ యాక్టివిటీస్ నిర్వహిస్తారు. ప్రభుత్వ కళాశాలలో చేరేటప్పుడు ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా అడ్మిషన్ తీసుకుంటారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. 2022 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఇంటర్మీడియట్ ఫలితాలతో పోలిస్తే 2023 విద్య సంవత్సరంలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. 2024 విద్య సంవత్సరంలో కూడా మరిన్ని మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

కళాశాలలకు ఇవి అవసరం.. ప్రతిపాదనలు పెట్టాం..

ఇంటర్మీడియట్ కళాశాలలో విద్యార్థులకు ప్రాక్టికల్ కోసం ఎక్విప్ మెంట్ అవసరం ఉండగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టాం. అలాగే బాలికలకు, బాలురుకు టాయిలెట్స్ కావాలని, మరిన్ని తరగతి గదులు పెంచాలని కోరాం. జిల్లా కేంద్రంలో ఉన్న బాలుర కళాశాలకు నూతన బిల్డింగ్ కావాలని విన్నవించాం. ఇటీవల నూతనంగా ఏర్పాటైన మండలాల్లో నూతన కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.

ప్రయివేటు వద్దు..ప్రభుత్వ కళాశాల ముద్దు..

డీఐఈఓ రవీందర్ కుమార్



10వ తరగతి పూర్తయిన విద్యార్థులు సర్కారు కళాశాలల్లోనే చేరాలి. ప్రయివేటు యాజమాన్యం చెప్పిన మాయమాటలు నమ్మి అధిక ఫీజులు చెల్లించి మోసపోవద్దు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య దొరుకుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని గమనించి, విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించాలి. విద్యార్థులు క్రమంగా కళాశాలకు హాజరుకావాలి. క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే మంచి ఫలితాలు వస్తాయి. కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయి. జూన్ 30 వరకు అవకాశం ఉంది.

డిగ్రీలో ప్రవేశానికి 'దోస్త్'

- జిల్లాలో కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ
- జులై 3వరకు వెబ్‌ఆప్షన్
- జులై 8 నుంచి తరగతులు ప్రారంభం







నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ ఆఫ్ తెలంగాణ) ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు మూడు విడతల్లో జరగనున్నాయి. మే 6 నుంచి ప్రారంభమైన మొదటి విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది. అలాగే జూన్ 6 నుండి ప్రారంభమైన రెండవ దశ ప్రక్రియ ముగిసింది. ఇక మూడవ దశ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ జూన్ 19 నుంచి జులై 2 వరకు రూ.425 రుసుముతో మూడో విడత రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. జూన్ 19 నుంచి జులై 3 వరకు మూడో దశ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జులై 6 వకరు మూడో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జులై 8 నుంచి డిగ్రీ కళాశాలల తరగతులు ప్రారంభమవుతాయి. మూడు దశల్లో సీటు పొందిన అభ్యర్థులు జులై 5వ తేదీ వరకు కళాశాలలో కచ్చితంగా రిపోర్ట్ చేసి సీటును కన్ఫర్మ్ చేసుకోవాల్సి ఉంటుంది.

కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీబీఎం, తదితర కోర్సుల్లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ కళాశాలలన్ని కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్నాయి.

జిల్లాలో 4 ప్రభుత్వ కళాశాలలు

ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం నాలుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో వివిధ రకాల కోర్సులు, వివిధ మాధ్యమాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. నాలుగు కళాశాలలు కలిపి సుమారుగా 2500 మందికిపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తారు. లైబ్రరీ సౌకర్యం, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ లాంటివి ఉన్నాయి. డిజిటల్ తరగతులు అనుభవజ్ఞులై అధ్యాపకులతో విద్య బోధన కొనసాగుతుంది. 3 సంవత్సరాల కాలం ఆరు సెమిస్టర్‌లతో విద్య సంవత్సరం సాగిస్తారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల భవిష్యతును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కొత్తరకం ఉపాధి కోర్సులను కూడా ప్రారంభిస్తోంది.

జాబ్ డ్రైవ్‌తో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం

డా.జలగం అనిత, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆదిలాబాద్



విద్యార్థులు చదువుకోవడానికి అన్ని రకాల వసతుల నడుమ విద్య బోధనను అందిస్తున్నాము. ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యను అందిస్తున్నాము. ఉమ్మడి జిల్లాలోనే న్యాక్‌లో బీ గ్రేడ్‌తో ముందున్నాము. డిగ్రీ పూర్తయిన అనంతరం కళాశాలలో సంవత్సరానికి రెండు సార్లు ప్రత్యేక జాబ్ డ్రైవ్‌లు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాము. కాంపిటేటివ్ పరీక్షకు విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నాము.

అత్యధిక అడ్మిషన్లు అవుతాయి

స్వామి,ఉట్నూర్ కళాశాల ప్రిన్సిపాల్



ఉమ్మడి జిల్లాలోని అన్ని కళాశాలలతో పోలిస్తే మా కళాశాలలో అత్యధికంగా అడ్మిషన్లు ప్రతి ఏటా జరుగుతాయి. దాదాపు వెయ్యి మంది విద్యార్థులు మా కళాశాలలో విద్యను అభ్యసిస్తారు. ఏజెన్సీ విద్యార్థులు ఇంటర్‌తో చదువును ఆపివేయకుండా అవగాహన కల్పించి డిగ్రీలో చేర్చుతాం. అన్ని రకాలుగా సౌకర్యవంతంగా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు క్రమశిక్షణతో చదివేల. ఉన్నత ఫలితాలు సాధించడమే లక్ష్యం.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

డా.అచ్చి శ్రీనివాస్, ప్రభుత్వ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఇచ్చోడ



ప్రభుత్వ కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. అనుభవజ్ఞులై అధ్యాపకులతో విద్యార్థులకు విద్య బోధన ఉంటుంది. సౌకర్యాలతో కూడిన విద్యను ఎంచుకోవాలి. ప్రయివేటు కళాశాలలో అధిక ఫీజులు తీసుకోవడమే కాకుండా నాణ్యమైన విద్య అందుబాటులో ఉండదు. నాణ్యమైన విద్యతో డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగావకాశాలు పొందాలి. అలాగే ఇచ్చోడ, ఆదిలాబాద్ కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

నాణ్యమైన విద్యనందిస్తున్న ఎస్ఆర్

- నామ మాత్రపు ఫీజులతో కార్పొరేట్ విద్య
- పదిలో ప్రతి ఏటా 100 శాతం ఉత్తీర్ణత
- ఇంటర్‌తోనే ఐఐటీ, నీట్ ప్రిపరేషన్


బాలుర జూనియర్ కాలేజ్


బాలికల జూనియర్ కాలేజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీల జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్‌లో గడిచిన 14ఏండ్లలో ఎస్ఆర్ విద్యాసంస్థలు కార్పోరేట్ స్థాయి విద్యను అందిస్తూ జిల్లా ప్రజల మన్ననలను పొందుతున్నామని ఎస్ఆర్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు సైతం అందుబాటులో ఉండేలా తక్కువ ఫీజులతో డిజిటల్ క్లాస్ రూంలలో అత్యుత్తమ విద్యను అందిస్తూ, ఆదిలాబాద్‌లో నంబర్ వన్‌గా నిలుస్తున్నామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 95కు పైగా విద్యాలయాలు కలిగిన ఎస్ఆర్ విద్యా సంస్థల యాజమాన్యం 2010-20211లో మొదటి సారిగా ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఎస్ఆర్ డీజీ స్కూల్‌ను ప్రారంభించింది. అనంతరం 2016-017లో ఎస్ఆర్ జూనియర్ కళాశాల తోపాటు ఎస్ఆర్ ప్రైమ్‌ను సైతం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆదిలాబాద్ ప్రజలకు మొట్టమొదటి సారిగా డిజిటల్ క్లాస్‌రూంలు, ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్స్‌లను పరిచయం చేసిన ఎస్ఆర్ డీజీ ప్రతీ ఏట ర్యాంకులతో తన సత్తా చాటుకుంటోందని అన్నారు.



పదిలో వందశాతం ఉత్తీర్ణత

పదవ తరగతి పరీక్షల్లో ప్రతీ ఏట 100 శాతం ఉత్తీర్ణత సాధించడం ఎస్ఆర్ డీజీ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. దీంతో పాటు విద్యార్థులు ప్రతీ సంవత్సరం పదవ తరగతిలో 10 జీపీఏలను క్రమం తప్పకుండా సాధించడం ఎస్ఆర్ విద్యాసంస్థల నాణ్యమైన చదువులకు నిదర్శనంగా నిలుస్తోంది. విద్యార్థులకు డిజిటల్ తరగతులతో పాటు సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ వంటి అత్యుత్తమ సౌకర్యాలు కల్పించడంతో ఏటేట అద్భుతమైన ఫలితాలను సాధిస్తోంది.

ఐఐటీ, నీట్‌ల కోసం స్పార్క్ అండ్ షార్ప్

విద్యార్థులకు చిన్న తరగతుల నుండే ఐఐటీ, నీట్ వంటి ఫౌండేషన్ కోర్సులను ఎలాంటి అదనపు రుసుము లేకుండా అందిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్పార్క్, షార్ప్‌ల పేరిట ప్రత్యేకమైన ఫౌండేషన్ కోర్సులను రూపొందించిన యాజమాన్యం విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఐఐటీ, నీట్ పరీక్షలపై పట్టు సాధించేలా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. దీంతో ప్రతీ ఏట ఇంటర్ తరువాత నేరుగా నీట్, జేఈఈ పరీక్షలకు విద్యార్థులు అర్హత సాధిస్తున్నారని చెప్పవచ్చు. ఎలాంటి లాంగ్ టర్మ్ కోచింగ్‌లు అవసరం లేకుండా ప్రతీ ఏట ఇంటర్ తరువాత పదుల సంఖ్యలో విద్యార్థులు నీట్, జేఈఈలకు అర్హత సాధించడం ఎస్ఆర్ జూనియర్ కళాశాలకే సాధ్యమని చెప్పవచ్చు.

క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు

చదువుతో పాటు ఆట, పాటలు ఉంటేనే విద్యార్థుల సమగ్ర వికాసం జర్గుతుందని నమ్మిన ఎస్ఆర్ విద్యాసంస్థలు తమ పాఠశాలల్లో ప్రతీ శనివారం, పండగ రోజుల్లో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇటీవల ఆదిలాబాద్ ఎస్ఆర్ డీజీ నుంచి ఆధ్యాపాట్య, షూటింగ్ బాల్ వంటి పోటీలకు ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయిలో ఎంపిక కావడంతో పాటు సాఫ్ట్ బాల్ పోటీలకు సైతం మరో ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. కేవలం చదువు మాత్రమే కాకుండ ఆట పాటలు, వివిధ రకాల పోటీ పరీక్షలకు అవసరమైన కోచింగ్‌ను అందిస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థుల పాలిట వరంగా మారింది. ఎస్ఆర్ దీనికి తోడు విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించే విదంగా ప్రతీ ఏట పోలీసులు, వైద్యులు, ఉన్నత అధికారులు, మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఆర్ విద్యా సంస్థలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కషి చేస్తున్నాయి.

కేజీబీవీలో ఉత్తమ ఫలితాలు

- ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత
- పాఠశాలకు, కళాశాలకు వన్నె తెస్తున్న బాలికలు

నవతెలంగాణ-నార్నూర్



ఉపాధ్యాయుల నాణ్యమైన విద్య బోధనతోనే గాదిగూడ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల, కళాశాల బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించారు. 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతిలో 40 మందికి 40 మంది బాలికలు వంద శాతం ఉత్తీర్ణీలయ్యారు. ఇందులో జె ఖుష్బు 9.3 జీపీఏ సాధించగా, జి భాగ్యశ్రీ 9.2, డేబ్బ్యా కవిత 9.2, జే శీతల్ 9.2, పి తిరుమల 9.2, యు వైష్ణవి 9.0, పి రాజ నందిని 9.0, ఏం కొమల్ 9.0 జీపీఏ సాధించారు. ప్రయివేటుకు ధీటుగా మంచి మార్కులు సాధించి మండల స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. ఇందులో జె ఖుష్బు 9.3 జీపీఏ సాధించి టాపర్ గా నిలిచింది. అలాగే ఇంటర్ ఫలితాల్లో కూడా 90 శాతం పైన ఫలితాలు వచ్చాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీలో అంకిత 419 మార్కులు, సెకండ్ ఇయర్‌లో బి కరిష్మా 867 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. ఈ పాఠశాల, కళాశాలలో దుర ప్రాంతాల నిరుపేద బాలికలు హాస్టల్ వసతితో చదువుకుంటున్నారు. వారికోసం పాఠశాల కళాశాలలో సకల సౌకర్యాలు కలిపిస్తున్నారు. ఇక్కడ విద్యా బోధనతో పాటు క్రీడ పోటీలు నిర్వహిస్తూ బాలికలకు అన్ని రకాలుగా తీర్చి దిద్దుతున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల సమయ పాలన పాటిస్తూ బాలికలకు నాణ్యమైన విద్యను బోధిస్తున్నారు. అలాగే మెనూ ప్రకారం పౌష్టిక ఆహారంతో పాటు అల్పాహారాన్ని అందిస్తున్నారు.

బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం

పి. ప్రియాంక, ఎస్ఓ, కేజీబీవీ గాదిగుడ

మా వద్ద కేజీబీవీ పాఠశాల కళాశాలలో చదువుకుంటున్న బాలికల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. బాలికలు ఆంగ్ల మాధ్యమంలో చదువులో రాణించేందుకు ఉపాధ్యాయ బృందం ఆహర్నిషలు కృషి చేస్తున్నారు. బాలికల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుంది. బాలికలు ఆరోగ్యంగా ఉంటేనే చదువుతో పాటు క్రీడలో రాణిస్తారు. ఈ విషయంలో అన్ని జాగ్రతలు పాటించడంతోనే ఉత్తమ ఫలితాలు సాధించగలిగాము.

సర్కారు బడి..నూతన ఒరవడి..!

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు - 2010
వీటి పరిధిలో చదువుతున్న విద్యార్థులు - 2.60లక్షలు
ప్రాథమిక పాఠశాలలు - 650
ప్రాథమికోన్నత పాఠశాలలు - 580
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు - 780
ఉమ్మడి జిల్లాలో కస్తూర్బాగాంధీ విద్యాలయాలు - 70
వీటి పరిధిలో విద్యార్థులు - 15వేలు
ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు సుమారు - 65
ఉమ్మడి జిల్లాలో ఆశ్రమోన్నత పాఠశాలలు - 113
గిరిజన ఆశ్రమ పాఠశాలలు - 1213

(మొదటి పేజీ తరువాయి)

ముందుగానే 25శాతం నిధులను విడుదల చేయడంతో పనులు సాఫీగా కొనసాగుతున్నాయి. పనుల బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించింది. వీటిల్లో అవసరమైన ఫర్నీచర్, టాయిలెట్లు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, తరగతి గదుల నిర్మాణం, ప్రహారీగోడ, బల్లలు, మేజర్, మైనర్ రిపేర్లు, విద్యుద్దీకరణ తదితర వాటిని చేపడుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇది వరకు కేవలం పాఠ్య పుస్తకాలు మాత్రమే ఉచితంగా అందించేవారు. కానీ ఇందులో మంది పేద పిల్లలు చదువుతున్నారనే కారణంగా వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నోటు పుస్తకాలు కూడా ఉచితంగా పంపిణీ చేస్తోంది.ఇక ప్రస్తుతం మధ్యాహ్న భోజనం కొనసాగిస్తుండగా.. కొత్త ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి పిల్లలకు ఉదయం పూట అల్పాహారం కూడా పెడుతామని హామీనిచ్చింది.

గురుకులాలు, కేజీబీవీలతో నాణ్యమైన విద్య

ప్రభుత్వ బడులతో పాటు వసతితో కూడిన మరింత నాణ్యమైన విద్యనందించేందుకు గురుకులాలు నెలకొల్పారు. ఈ విద్యాలయాలు గతం నుంచి ఉన్నప్పటికీ.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మరింత అభివృద్ధి చెందాయి. ఒకప్పుడు జిల్లాలో ఐదు వరకు మాత్రమే ఉండగా.. తాజాగా వీటి సంఖ్య పది నుంచి 20కి చేరుకున్నాయి. ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఆంగ్ల మాధ్యమం బోధిస్తున్నారు. ఇంటర్‌లో ప్రత్యేకంగా సీఓఈ(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) పేరిట కొందరు విద్యార్థులను ఎంపిక చేసి నీట్, ఐఐటీ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఫలితంగా అనేక మంది విద్యార్థులు వైద్యులు, ఇంజనీర్లుగా రాణిస్తున్నారు. ప్రముఖ యూనివర్సిటీల్లో సీట్లు దక్కించుకొని ఉన్నత చదువులు పూర్తిచేసుకొని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఇక ఇందులో బోజనంతో పాటు వసతితో కూడిన అన్ని రకాల ఆధునిక సౌకర్యాలు విద్యార్థులకు కల్పిస్తున్నారు.

కేజీబీవీల్లోనూ నాణ్యమైన చదువు..!

బాలిక విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం కస్తూర్బాగాంధీ విద్యాలయాలను నెలకొల్పింది. చదువు మానేసిన బాలికలకు మళ్లీ విద్యనందిచడంతో పాటు వృత్తివిద్యలోనూ శిక్షణ ఇప్పించాలనేది వీటి ఉద్దేశం. కానీ ప్రభుత్వం ఈ కేజీబీవీలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటుచేసింది. వీటిలో గురుకులాల మాదిరిగానే భోజనం పెట్టడంతో పాటు వసతితో కూడిన సౌకర్యాలను కల్పిస్తున్నారు. వీటితో పాటు నాణ్యమైన విద్యనందించడంతో అనేక మంది విద్యార్థులు పది, ఇంటర్‌లో మంచి మార్కులతో రాణిస్తున్నారు. ఇది వరకు పది వరకే పరిమితం కాగా.. తాజాగా అన్ని జిల్లాల్లోనూ ఇంటర్ వరకు వీటిని ఉన్నతీకరించారు. దీంతో బాలికలు ఉన్నత చదువులు కొనసాగించేందుకు అవకాశం ఏర్పడుతోంది.

సర్కారు బడుల్లో అన్ని రకాల సౌకర్యాలు :
టి.ప్రణీత, జిల్లా విద్యాశాఖాధికారి,ఆదిలాబాద్



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో వివిధ రకాల ఆధునిక వసతులు అందుబాటులోకి తీసుకొచ్చింది. నాణ్యమైన చదువుతో పాటు భోజనం, ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు కూడా పంపిణీ చేస్తోంది. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట చేపట్టిన పనులు దాదాపు పూర్తికావస్తున్నాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని చదువుల్లో రాణించాలి.

అక్షరం..భవితకు సాక్షరం..!

- కొత్తగా ఎన్ఐఎల్పీ ద్వారా నిర్వహణ
- మిగిలిన వారికి ఐదేండ్లలో నేర్పించేలా ప్రణాళిక
- మళ్లీ గాడిలోకి సాక్షర భారత్ కార్యక్రమాలు
- ఉమ్మడి జిల్లాలో మొదలుకానున్న రాత్రిబడి

అక్షరం విజ్ఞానాన్ని నింపుతుంది. ప్రతి మనిషి అక్షరాలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. కేంద్రం ప్రభుత్వం తొలిసారిగా అక్షరజ్ఞానం పేరిట పల్లెల్లో రాత్రి బడులు నిర్వహించింది. చేతిరాత రాని లక్షలాది మందికి అక్షరాలు నేర్పించింది. కానీ అందరినీ అక్షరాస్యులను చేయడంలో మాత్రం సఫలం కాలేకపోతోంది. ఉమ్మడి జిల్లాలో ఇంకా లక్షల మంది నిరక్షరాస్యులుగా మిగిలిపోయారు. తాజాగా కేంద్రప్రభుత్వం న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం(ఎన్ఐఎల్పీ) అమలు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడ అమలుకు శ్రీకారం చుట్టిన అధికారగణం మరికొన్ని రోజుల్లోనే పూర్తిస్థాయిలో అమలు చేయాలని యోచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మిగిలిన 4.72లక్షల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అక్షరక్రమంలో ముందున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అక్షరాస్యతలో మాత్రం వెనుకబడి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుతం ఉమ్మడి జిల్లా 60శాతం అక్షరాస్యతను కలిగి ఉండగా.. ఇటీవల నిర్వహించిన పల్లె ప్రగతి సందర్భంగానూ గ్రామాల్లో అక్షరాస్యుల వివరాలను సేకరించారు. వీటి ప్రకారం ప్రస్తుతం 61.01శాతంగా మాత్రమే నమోదైంది. ఇది వరకు ఉమ్మడి జిల్లాలో అక్షరాస్యతను పెంచేందుకు ప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టింది. తొలిసారిగా అక్షరజ్ఞానం పేరిట చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలనిచ్చింది. రాత్రి సమయంలో బడులు నిర్వహించి పలక, బలపం అందించి నిరక్షరాస్యులకు చదువు నేర్పించారు. దీంతో చాలా మంది వారి పేర్లు రాయడం నేర్చుకున్నారు. అనంతరం సాక్షరభారత్ ద్వారా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేశారు. గ్రామ, మండల స్థాయిలో కోఆర్డినేటర్లను నియమించడంతో పాటు పుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికేట్లు జారీ చేశారు. అనంతరం ఈ కార్యక్రమం స్థానంలో ఉపాధిహామీ చదువు, అమ్మానాన్న చదువు, అంగన్వాడీ చదువు పేరిట వివిధ రకాలుగా నిర్వహించారు. కానీ కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని 2018 మార్చిలో నిలిపివేసింది. దీంతో సాక్షరభారత్ ద్వారా అమలైన కార్యక్రమాన్ని అర్థాంతరంగా నిలిచిపోయింది.



పిల్లలతో చదువు చెప్పించడం..!

కేంద్రప్రభుత్వం మళ్లీ అక్షరాస్యత మీద దృష్టిపెట్టింది. అక్షరాలు రాని వారికి నేర్పించేందుకు కొత్తగా న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం(ఎన్ఐఎల్పీ) అమలు చేయాలని భావిస్తోంది. ఈ పథకంలో కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఏడు, ఎనిమిది, తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులతో గ్రూపులుగా ఏర్పాటుచేసి తల్లిదండ్రులు, ఇతరులకు చదువు చెప్పించే కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. సాయంత్రం ముగిసిన తర్వాత రాత్రి సమయంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల వారీగా చదువుకున్న విద్యార్థులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

ఉమ్మడి జిల్లాలో మిగిలిపోయిన నిరక్షరాస్యుల ఇవి

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం
ఆదిలాబాద్	44635	82828	127463
నిర్మల్	46820	99637	146457
ఆసిఫాబాద్	37059	59097	96156
మంచిర్యాల	37033	65416	102449

కార్యక్రమాన్ని విస్తృతం చేస్తాం : శ్రీనివాస్‌రెడ్డి, సాక్షరభారత్ డీడీ, ఆదిలాబాద్



ఉమ్మడి జిల్లాలో మిగిలిపోయిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు కేంద్రప్రభుత్వం న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం(ఎన్ఐఎల్పీ)ని ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలోనూ ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే మొదలుపెట్టాం. రానున్న రోజుల్లో మరింత విస్తృతం చేస్తాం. అందరినీ అక్షరాస్యులను చేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడుతాం.

పదిలో నిర్మల్‌దే అగ్రస్థానం..!

- రాష్ట్రంలో వరుసగా రెండోసారి నిలిచిన జిల్లా
- 17వ స్థానంలో ఆదిలాబాద్..మంచిర్యాలకు 20వ స్థానం
- 31వ స్థానంలో నిలిచిన కుమురంభీం ఆసిఫాబాద్
- స్థానాలు తగ్గినా..ఉత్తీర్ణతశాతంలో మాత్రం మెరుగు

పదో తరగతి ఫలితాల్లో నిర్మల్ మరోసారి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. వరుసగా రెండోసారి రాష్ట్రంలోనే మొదటి స్థానం దక్కించుకొని ఖ్యాతిగడించింది. ఏకంగా 99.05శాతం ఉత్తీర్ణత సాధించి ఫలితాల్లో తనకు సాటిలేదని నిరూపించింది. గతేడాది ఫలితాల కంటే 0.9శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించడం విశేషం. మరోపక్క మిగితా మూడు జిల్లాలు మాత్రం పదో తరగతి ఫలితాల్లో వెనుకబడ్డాయి. ఆదిలాబాద్ జిల్లా 92.93శాతంతో రాష్ట్రంలో 17వ స్థానం సాధించగా.. 92.42శాతం ఉత్తీర్ణతతో మంచిర్యాల జిల్లా 20వ స్థానానికి ఎగబాకింది. మరోపక్క ఇంటర్ మంచి ప్రతిభ కనబర్చిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పదో తరగతికి వచ్చేసరికి వెనుకబడింది. రాష్ట్రంలో ఏకంగా 31వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా రాష్ట్రంలో స్థానాల పరంగా చూస్తే ఈ మూడు జిల్లాలు ఫలితాల్లో వెనుకబడినప్పటికీ ఉత్తీర్ణత శాతంలో మాత్రం మెరుగైన ఫలితాలే సాధించడం గమనార్హం.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పదో తరగతిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఉమ్మడి నాలుగు జిల్లాలో ఒక జిల్లా అందరి కంటే టాప్‌లో నిలవగా.. మిగితా మూడు జిల్లాలు వెనుకంజలో నిలిచాయి. స్థానాలు దిగజారినా..ఉత్తీర్ణత శాతం మెరుగుపడటంతో ఫలితాల్లో పర్వాలేదనిపించాయి. ఉమ్మడి జిల్లాలో 34,958మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 32,368మంది ఉత్తీర్ణులయ్యారు. కేవలం 2590మంది విద్యార్థులు మాత్రమే అనుత్తీర్ణులయ్యారు. విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ.. అధికారుల పర్యవేక్షణ ఫలితంగా పదో తరగతిలో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చేందుకు కారణమయ్యాయి. ముఖ్యంగా ఈ నాలుగు జిల్లాల్లోనూ ఉత్తీర్ణత శాతంలో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించడం విశేషం.

నిర్మల్ జిల్లాలో 8908 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8823మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 4300మంది పరీక్ష రాయగా 4246మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 4608మంది పరీక్ష రాయగా 4577మంది పాస్ కాగా జిల్లాలో 99.05శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో నెంబర్ 1గా నిలిచారు.

ఆదిలాబాద్ జిల్లాలో 10,374 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 9641మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 5179మంది పరీక్ష రాయగా 4744మంది పాసయ్యారు. బాలికలు 5195మంది పరీక్ష రాయగా 4897మంది ఉత్తీర్ణతతో జిల్లాలో 92.93శాతం సాధించారు.

మంచిర్యాల జిల్లాలో 9283మంది విద్యార్థులు పరీక్ష రాయగా 8579మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 4748మంది పరీక్ష రాయగా 4338మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 4535మంది పరీక్ష రాయగా 4241మంది పాసయ్యారు. జిల్లాలో 92.42శాతం ఉత్తీర్ణత సాధించారు.

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 6393మంది విద్యార్థులు పరీక్ష రాయగా 5325మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 3008మంది పరీక్ష రాయగా 2366మంది పాసయ్యారు. బాలికలు 3385మంది పరీక్ష రాయగా 2959మంది పాస్ కాగా 83.29శాతం ఉత్తీర్ణత సాధించారు.

టీచర్లు లేక..బోధనకు ఆటంకం..!

- సర్కారు బడుల్లో వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- తాజాగా బదిలీలు, పదోన్నతులతో మరిన్ని ఖాళీలు
- తాత్కాలికంగా నియమిస్తేనే తక్షణ పరిష్కారం

సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పిస్తున్నా.. ఉపాధ్యాయుల కొరత వీడటం లేదు. ఏండ్లుగా ఈ సమస్య ఉత్పన్నమవుతున్నా ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్న దాఖలాలు కనిపించడం లేదు. గత ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోవడంతో బడుల్లో ఖాళీలు పేరుకుపోగా.. కొత్త ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో 1295 పోస్టులు భర్తీ చేసేందుకు నిర్ణయించింది. ఇందుకు దరఖాస్తులు సైతం స్వీకరించింది. మధ్యలో ఎన్నికల ప్రక్రియ ఉండటంతో తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. కొత్త పోస్టులు భర్తీ చేస్తున్నా.. తాజాగా చేపడుతున్న బదిలీలు, పదోన్నతుల క్రతువు కారణంగా కిందిస్థాయిలో మరిన్ని ఖాళీలు ఏర్పడుతాయని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది బోధనకు ఆటంకం లేకుండా తాత్కాలికంగా విద్యావాలంటీర్లను నియమించాల్సిన అవసరం ఉంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సర్కారు బడులను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతోంది. సౌకర్యాలు కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచాలని తాపత్రయ పడుతోంది. ఇందులో భాగంగా అమ్మ అదర్శ పాఠశాలల పేరిట వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. దీంతో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయ లోకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ బోధకుల పోస్టులు మాత్రం భర్తీ కాకపోవడంతో వారిని నిరుత్సాహనికి గురిచేస్తోంది. కొత్త ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ.. నియామకాలు పూర్తిచేయలేదు. మరోపక్క అనేక మంది ఉపాధ్యాయులు రిటైర్డ్ అవుతుండటంతో బడుల్లో మరిన్ని ఖాళీలు ఏర్పడుతున్నాయి. కేవలం ఆదిలాబాద్ జిల్లాలోనే 3028 ఉపాధ్యాయ పోస్టులు అవసర ముండగా.. కేవలం 2473మంది మాత్రమే పనిచేస్తున్నారు. మరో 555 పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉన్నత పాఠశాలల్లో కొన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేకపోవడంతో సర్దుబాటు పేరిట ఎస్జీటీలను నియమించి బోధన చేయిస్తున్నారు. సర్కారు బడుల్లో ఏండ్లుగా ఈ సమస్య ఉన్నప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో ఈ ఏడాది పాఠాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే విద్యావాలంటీర్ల నియామకం అత్యవసరమని ఉపాధ్యాయవర్గాలు చెబుతున్నాయి.

కార్మికులు అత్యవసరం..!

ఇది వరకు ప్రభుత్వం సర్కారు బడుల్లో పారిశుధ్య కార్మికులను నియమించింది. తరగతి గదులు, ఆవరణ శుభ్రం చేయడంతో పాటు మరుగుదొడ్లు, టాయిలెట్లు శుభ్రం చేయడం..చెట్లకు నీళ్ల పట్టించడం వంటి పనులు చేసేవారు. వీరికి పాఠశాలకు వచ్చే నిధుల నుంచి వేతనాలు చెల్లించేవారు. కానీ గత ప్రభుత్వమే వీరిని విధుల నుంచి తొలగించి ఆయా గ్రామాల్లో నియమించిన పారిశుధ్య కార్మికులకు బడుల బాధ్యతను అప్పగించింది. కానీ వీరు ఉదయం పూట పాఠశాల శుభ్రం చేస్తున్నప్పటికీ.. చెట్లకు నీళ్ల పట్టించడం, మరుగుదొడ్లు శుభ్రం చేయడం వంటి పనులు చేయడం లేదు. దీంతో అవి అపరిశుభ్రంగా మారుతుండటంతో వినియోగించడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా వీరిని నియమించడంతో పాటు ప్రస్తుతం బడుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు రింత వేగవంతం చేయడంతో పాటు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చూడాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం పూట విద్యార్థులకు అల్పాహారం అందిస్తామని హామీనిచ్చింది. దీనిని కచ్చితంగా అమలు చేస్తే విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు వారు ఆరోగ్యవంతులుగా మారేందుకు దోహదం చేస్తుందని చెబుతున్నారు.

ప్రయివేటు వద్దు..ప్రభుత్వ కళాశాలలే ముద్దు

● ప్రయివేటుకు ధీటుగా విద్యా బోధన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయివేటు కళాశాలలతో పోలిస్తే ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలోనే నాణ్యమైన విద్య బోధన ఉంటుందని, ఆ విద్యతో బంగారు భవిష్యత్తుకు బాటలు వేయొచ్చని ఆదిలాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) ప్రిన్సిపాల్ భగవాండ్లు తెలిపారు. కళాశాలలో ప్రయివేటుకు ధీటుగా విద్యను బోధిస్తున్నామని, విద్యార్థులు తమ కళాశాలలో చేరాలని కోరారు. కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు సాగిస్తున్నారని, ఆ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకొని విద్యార్థుల చదువుపై దృష్టి పెడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో సౌకర్యాలు, బోధనపై 'నవతెలంగాణ'తో మాట్లాడారు.

అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన

జిల్లాలో ఉన్న 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెద్ద కళాశాలగా పట్టణంలోని బాలికల కళాశాల ఉంది. ఇందులో దాదాపు 800 నుండి 850 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కళాశాలలో వివిధ కోర్సులు, వివిధ మాధ్యమల్లో అందుబాటులో ఉన్నాయి. జనరల్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో అందుబాటులో ఉన్నాయి. సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు తెలుగు మీడియంలో ఉన్నాయి. అలాగే ఓకేషనల్‌లో ఎంపీడబ్ల్యూహెచ్, ఎంఎల్‌టీ, ఆర్ఎం కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్య బోధన ఉంది. కళాశాలకు జిల్లాలోని ప్రధాన మండలాలు, గ్రామాల నుండి విద్యార్థులు వస్తున్నారు.



చదువుతోనే సమాజంలో గుర్తింపు

భగవాండ్లు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు)



ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్య బోధన ఉంటుంది. విద్యార్థులు ఇంటర్ నుండే క్రమశిక్షణతో కూడిన విద్య తీసుకోవాలి. ఇంటర్ నుండే ఆచితూచి అడుగు వేయాలి. ఇక్కడి నుండే భవిష్యత్‌కు అడుగులు ప్రారంభమవుతాయి. విద్యార్థులు ఏ చెడు అలవాట్లకు బానిస కాకుండా చదువుపై దృష్టి సారించాలి. చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుంది. మంచిగా చదివి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలి. క్రమంగా తరగతులకు హాజరవుతూ ఫలితాలు సాధించాలి. దానికి కళాశాల అధ్యాపకులు నిరాంతరం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తు సన్నద్ధం చేస్తున్నారు.

సౌకర్యాలు, గదుల కోసం ప్రతిపాదనలు

ప్రస్తుతం కళాశాలలో విద్యార్థులు (బాలికల) కోసం అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. కళాశాలలో లైబ్రరీ సదుపాయం, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యముంది. వారాంతపు పరీక్షలు, ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. మొత్తం కళాశాలలో 30 మంది అధ్యాపకుల సిబ్బంది అందుబాటులో ఉన్నారు. కాగా కళాశాలకు విద్యార్థుల కోసం పది నూతన తరగతి గదులు అవసరమవ్వగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టారు. అక్కడి నుండి అనుమతులు రావాల్సి ఉంది.

అడ్మిషన్లు పెంచేందుకు ప్రత్యేక చర్యలు

కళాశాలలో 2023 విద్య సంవత్సరానికి సంబంధించి రెండవ సంవత్సరంలో 58.57 శాతం మంది విద్యార్థులు, మొదటి సంవత్సరంలో 44.82 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మరింత మెరుగైన ఫలితాల కోసం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇంటర్మీడియట్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగగా మా కళాశాలలో చేరండి మా వసతులు ఇవి అంటూ ప్రచారం చేస్తున్నారు. కళాశాలలో అడ్మిషన్ల కోసం గ్రామాలు, మండలాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం 250 అడ్మిషన్లు కాగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. గత సంవత్సరం 450కి పైగా అడ్మిషన్లు జరిగాయి. జూన్ 30 వరకు అడ్మిషన్ల ప్రక్రియ జరుగనుంది. విద్యార్థులు కళాశాలలో చేరి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరుతున్నారు.

నిరుద్యోగులకు వరంగా బీసీ స్టడీ సర్కిల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాల కోసం కష్టపడాల్సి వసుతంది. రెండు, మూడు నెలలు చదివితే తప్ప ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదు. చదువులకే బోలెడు డబ్బులు ఖర్చవుతున్నాయి. ఖర్చులు భరించలేని పేద విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ వరంలా మారింది ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో గల బీసీ స్టడి సర్కిల్. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలైన నోటిఫికేషన్లకు అనుగుణంగా ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. బీసీ స్టడీ సర్కిల్‌పై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం.

బీసీ స్టడీ సర్కిల్‌లో లైబ్రరీ భేష్..!

జిల్లా కేంద్రంలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌లోని 500 మంది అభ్యర్థులు చదువుకునే సామర్థ్యంతో లైబ్రరీ ఉంది. ప్రస్తుతం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 250 మంది అభ్యర్థులు స్టడీ హాల్ లైబ్రరీని ఉపడియోగించుకుంటున్నారు. అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఏ క్యాటగిరికి చెందిన విద్యార్థులైన ఈ స్టడీ హాల్‌ను వినియోగించుకోవచ్చు. అలాగే లైబ్రరీలో న్యూస్ పేపర్స్, మ్యాగ్జిన్స్ అందుబాటులో ఉన్నాయి. ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు గ్రంథాలయాన్ని వినియోగించుకోవచ్చు.

కొలువులు సాధిస్తూ.. స్థిరపడుతూ

స్టడీ సర్కిల్‌లో అభ్యర్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. శిక్షణాలను నిపుణులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ





సంవత్సరంలో దాదాపు 100 మంది అభ్యర్థులు సర్కార్ కొలువులు సాధించి జీవితంలో స్థిరపడ్డారు. ఇందులో 55 మంది కానిస్టేబుల్, ఎస్ఐ, 10మంది గురుకులాలు, 12 మంది స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ జనజర్ డ్యూటీ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. అలాగే 14 మంది గ్రూప్-4లో మెరిట్ లిస్ట్‌లో ఉన్నారు.

సోషల్ మీడియాలో స్టడీ సర్కిల్ ఫస్ట్

నేటి కాలంలో ప్రస్తుతం ప్రతిదీ సోషల్ మీడియాతోనే ముడిపడి ఉంది. ఏ సమాచారం కావాలన్న సోషల్ మీడియాలో వేగంగా దొరుకుతుంది. ఈ నేపథ్యంలోనే బీసీ స్టడీ సర్కిల్ సోషల్ మీడియాను ఉపయోగించుకుంటుంది. టెలిగ్రాం గ్రూప్ ద్వారా 10 వేల మందికి, వాట్సప్ గ్రూప్ ద్వారా 8 వేల మందికి విద్య ఉద్యోగ సమాచారం అందిస్తున్నారు. అలాగే ప్రతిరోజు విద్యార్థులకు ఉపయోగపడే కరెంట్ ఎఫైర్స్, ప్రశ్నలతో కూడిన వివిధ పీడీఎఫ్‌లు పోస్ట్ చేస్తున్నారు. ఆయా పోటీ పరీక్షలకు సంబంధించి, వేర్వేరుగా సోషల్ మీడియాలో గ్రూపులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వారికి కావాల్సిన సమాచారం అందిస్తూ

● ఉచిత శిక్షణలు.. లైబ్రరీ సౌకర్యం



ఉద్యోగం సాధించేలా ప్రోత్సహిస్తున్నారు.

అభ్యర్థులకు గ్రాండ్ టెస్టులు

గ్రూప్-1 అభ్యర్థులకు 10 గ్రాండ్ టెస్టులు నిర్వహించారు. త్వరలో గ్రూప్-2 వారికి 20 గ్రాండ్ టెస్టులు పెట్టనున్నారు. ప్రస్తుతం డీఎస్సీ అభ్యర్థులకు గ్రాండ్ టెస్టులు కొనసాగుతున్నాయి. స్టడీ సర్కిల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి అభ్యర్థులున్నారు. దగ్గరలో ఉన్న హాస్టల్‌లో ఉంటూ సన్నద్ధం అవుతున్నారు. శిక్షణకు లేదా లైబ్రరీ కోసం వచ్చే అభ్యర్థులు ధ్రువపత్రాలతో రావాలి. సమాచారం కోసం 08732221280 నంబరును సంప్రదించాలి.

నిరుద్యోగులు శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలి

-ప్రవీణ్ కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్



నిరుద్యోగుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఉమ్మడి జిల్లాల నిరుద్యోగ అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇస్తున్నాం. అన్ని విధాలుగా ఉపయోగపడుతుంది. స్టడీ సర్కిల్‌లో అందించే ప్రతి శిక్షణను అభ్యర్థులు వినియోగించుకోని కొలువులు సాధించాలి. అభ్యర్థుల కోసం మోటివేషనల్ తరగతులు నిర్వహిస్తున్నాం.

పారిశ్రామిక విద్య..భవితకు భరోసా..

- ఐటీఐతో ఉపాధి అవకాశాలకు మార్గం
- ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుతం ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహంతో పాటు రుణాలు ఇస్తున్నాయి. ఈ క్రమంలో పరిశ్రమిక విద్యకు ఆదరణ పెరిగింది. విద్యార్థులు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆదిలాబాద్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత సూచించారు. ఐటీఐ చదివిన తర్వాత విద్యార్థులకు ఉపాధి అవకాశాలకు మార్గాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఐటీఐ కళాశాల విద్యపై 'నవతెలంగాణ'తో మాట్లాడారు.

విడుదలైన ప్రవేశాల నోటిఫికేషన్

ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులకు నోటిఫికేషన్ మే నెలలో వెలువడింది. ఎన్‌సీవీటీ విధానంలో కోర్సులు ఆగస్టులో ప్రారంభమవుతాయి. ట్రేడ్‌ను అనుసరించి కోర్సు వ్యవధి ఏడాది, రెండేళు ఉంటాయి. అభ్యర్థులు ఎంచుకొన్న ఐటీఐ సంస్థలు, ట్రేడ్‌ల ప్రాధాన్యక్రమాన్ని దరఖాస్తులో సూచించాలి. అకడమిక్ ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. క్రాఫ్ట్‌మెన్ ట్రెయినింగ్ స్కీం కింద శిక్షణ ఇస్తారు. కోర్సులో భాగంగా ప్రాక్టికల్ ట్రెయినింగ్, థియరిటికల్ ట్రెయినింగ్, ట్రేడ్ థియరీ, వర్క్‌షాప్ క్యాలిక్యులేషన్, సైన్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్ ఉంటాయి. ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ నేర్పిస్తారు. లైబ్రరీ సౌకర్యం ఉంది.

షెడ్యూల్ వెబ్‌సైట్ వివరాలు

ఐటీఐలో ప్రవేశాలకు మొదటి విడత ప్రక్రియ ముగిసింది. ఇక రెండవ విడత ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్ త్వరలో రానుంది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు వెబ్ ఆప్షన్స్ సబ్మిట్ చేయాలి. 8వ తరగతి పూర్తి చేసిన వారికి కొన్ని ట్రేడ్‌లలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి అన్ని ట్రేడ్‌లలో చేరే అవకాశముంటి. ఐటీఐ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకునే సమయంలోనే ధ్రువ పత్రలను కూడా అందులోనే ఉంచుకోవాలి. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా మార్కులు,



సామాజిక వర్గాలను బట్టి ఎంచుకున్న ట్రేడ్, ఐటీఐకి అర్హులైతే సీట్ కేటాయిస్తారు.

అందుబాటులో ఉన్న ట్రేడ్‌లు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రిషియన్, సివిల్, వెల్డర్, స్టెనోగ్రాఫి, డ్రెస్ మేకింగ్, కోప ఆరు రకాల ట్రెడ్లు అందుబాటులో ఉన్నాయి. ఎలక్ట్రిషియన్, సివిల్ కోర్సులు రెండు సంవత్సరాల కాలం, మిగతావి ఒక సంవత్సరం వరకు ఉంటుంది. ఈ ట్రెడులకు సంబంధించిన అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఇటీవల అన్ని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏటీసీ అని కొత్త ట్రెడును ప్రవేశ పెట్టారు. ఈ కోర్సు ఇంకా అందుబాటులో రాలేదు. అందుబాటులో రావడానికి ఆరు, ఏడు నెలల కాలం పడుతుంది.

ఐటీఐ అంటే ఏమి ..?

ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(ఐటీఐ) ఈ ఇనిస్టిట్యూట్లను పోస్ట్ సెకండరీ స్కూల్స్ అని కూడా అంటారు. మన దేశంలో యువ నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నడిచే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ సంస్థ ఈ కోర్సులను ఆఫర్ చేస్తుంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ సంస్థ గుర్తింపు పొందిన ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లు నేడు ప్రతి నగరంలో ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ ఐటీఐలతో పాటు ప్రయివేటు ఐటీఐలు కూడా ఉన్నాయి. ఐటీఐల ప్రధాన లక్ష్యం యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడంతో పాటు పరిశ్రమలకు అత్యున్నత నైపుణ్యం కలిగిన కార్మికులను అందించడం. ఐటీఐలలో చేరాలంటే కనీసం విద్యార్హత పదవ తరగతి (కొన్ని కోర్సులకు 12 వ తరగతి లేదా ఇంటర్మీడియట్). కానీ కొన్ని ప్రత్యేకమైన కోర్సులకు ఎనిమిదవ తరగతిని కూడా కనీస అర్హతగా ప్రభుత్వం నిర్ణయించింది.

ఉపాధి అవకాశాలు

ఐటీఐ కోర్సులు చేసిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగానే ఉన్నాయి. తొలుత వీరు కోర్సు పూర్తిచేయగానే ఏదైనా పరిశ్రమలో అప్రెంటీస్ చేయడానికి అర్హులు. తర్వాత ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలలో ఉద్యోగాలు చేయడానికి అర్హులు. ప్రతి సంవత్సరం ఆర్ఆర్‌బీ(రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు), ఇండియన్ నేవీ, ఆర్మీ ఎయిర్ ఫోర్స్, షిప్ యార్డులు, స్టీల్ ప్లాంట్స్, డాక్ యార్డ్స్, కెమికల్ ఫ్యాక్టరీస్, నిర్మాణ సంస్థలు కూడా ఐటీఐ చేసిన ట్రేడ్ మెన్ కోసం ఉద్యోగ అవకాశాలను అందిస్తున్నాయి. అయితే ఈ ఉద్యోగాలు పొందాలంటే ఆయా ప్రభుత్వ సంస్థ నిర్వహించే ఎంపిక పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగాలను పక్కన పెడితే, నేడు ఐటీఐ చేసిన వాళ్లకు ప్రయివేటు సంస్థలు కూడా మంచి ఉద్యోగ అవకాశాలనే అందిస్తున్నాయి. జాబ్ పోర్టల్స్‌లో ఉద్యోగ సమాచారాన్ని నిత్యం ఫాలో అవుతూ, ఖాళీలు ఉన్నప్పుడు ఔత్సాహికులు దరఖాస్తులు చేసుకుంటున్నారు.







రెండవ విడతలో అడ్మిషన్ పొందాలి

టి.సుజాత, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్



ఐటీఐ కళాశాలలో అనేక ఉపాధి అవకాశాలున్నాయి. ఐటీఐలో చేరి ఉపాధి పొందవచ్చు. రెండవ విడత ద్వారా అడ్మిషన్లు పొంది కళాశాలలో చేరండి. మీకు నచ్చిన ట్రేడ్‌లో చేరి.. కోర్సును పూరి ్తచేసుకొని ఏదైనా పరిశ్రమలో అప్రెంటిష్‌షిప్ చేయడానికి అర్హులు అవుతారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఇంటర్‌లో నాణ్యమైన విద్య అందిస్తున్నాం

- ఫలితాల్లో జిల్లాను ఉన్నత స్థానంలో నిలబెడతాం
- జె.పరశురాం, డీఐఈఓ నిర్మల్

నవతెలంగాణ-నిర్మల్



ఇంటర్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, భవిష్యత్తులో రాష్ట్రంలోనే పరీక్ష ఫలితాల్లో జిల్లాను ఉన్నత స్థానంలో నిలబెడతామని జిల్లా మాధ్యమిక విద్యాశాఖాధికారి పరశురాం అన్నారు. విద్యారంగ ప్రత్యేక సంచిక సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 63 కళాశాలలు ఉన్నాయి. అందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 13 ఉన్నాయని, ప్రయివేటు కళాశాలలు 20 ఉన్నాయని తెలిపారు. మిగతావి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కేజీబీవీ, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, ఎంజీపీ లాంటి కళాశాలలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ కళాశాలలో 2,500 మంది విద్యార్థుల చేరిక లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1155 అడ్మిషన్లు జరిగాయని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ఫ్రీ అడ్మిషన్లు, సంబంధిత పుస్తకాలు ఇవ్వడం జరుగుతుంది. ప్రభుత్వ కళాశాల పరిధిలో మొత్తం 203 మంది అధ్యాపకులు ఉన్నారు. ఇందులో 21 మంది రెగ్యులర్, 110 కాంట్రాక్ట్ పద్దతిలో, ఒకేషనల్ విభాగంలో 4, ఇందులో కాంట్రాక్ట్ విభాగంలో 14, బెస్ట్ ఫ్యాకల్టీ కింద 54 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు. ఒక్కో కళాశాలకు మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాల కోసం రూ.25 లక్షల నిధులు అవసరమన్నారు. వీటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రయివేట్ కళాశాలలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నామని వెల్లడించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న వాటిపై చర్యలు చేవడుతున్నామన్నారు. ప్రభుత్వ కళాశాలలో సైతం విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో రాష్ట్రంలో జిల్లా 16 ర్యాంకులో నిలిచిందని, అలాగే ద్వితీయ సంవత్సరంలో 12 ర్యాంకులో నిలిచిందని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లాను ఉన్నత స్థానంలో నిలబెడతామని వెల్లడించారు.

ఇంద్రవెల్లి పబ్లిక్ పాఠశాలలో మెరుగైన విద్య



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఇంద్రవెల్లి పబ్లిక్ పాఠశాల(ఇంగ్లీష్ మీడియం) కరస్పాండెంట్ అజ్జు హిరానీ, ముస్లే కేశవ్ తెలిపారు. పాఠశాల ఆరంభమై 12 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. అప్పటి నుంచి పాఠశాలలో క్వాలిఫైడ్ ఉపాధ్యాయ సిబ్బందితో ఎల్‌కేజీ నుంచి యూపీఎస్ వరకు డిజిటల్ విద్యను అందిస్తున్నామన్నారు. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అర్. దుర్గాదాస్, జవాడే చరణ్ కుమార్ నవోదయ పాఠశాలలో సీటు సాధించారని తెలిపారు. ఏజన్సీలోని మారుమూల గిరిజన విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా స్కూల్‌ను స్థాపించామని వెల్లడించారు. 2005 విద్యాహక్కు చట్టం ప్రకారం పేద మధ్య తరగతి, అనాథ పిల్లలకు ఉచితంగా విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. దీంతో పాటు పిల్లలకు వృత్తి నైపుణ్యం అందిస్తున్నట్టు తెలిపారు. హీరాపూర్‌లో విశాలమైన ఆటస్థలంతో పాటు ఆహ్లాదకరమైన మంచి వాతావరణంలో బోధనలు అందిస్తున్నామని వివరించారు.



మండలంలో పలుచోట్ల భారీ వర్షం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలో శుక్రవారం పలుచోట్ల ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. పుసిగూడ, జామడ, బలాన్‌పూర్, నాగల్‌కొండ, గుంజాల, గంగాపూర్, తాడిహత్నూర్ తదితర గ్రామాల్లో వర్షం పడింది. వారం రోజుల నుండి విత్తనాలు వేసి వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా మిషన్ భగీరథ సర్వే

నవతెలంగాణ-నార్నూర్

మిషన్ భగీరథ సర్వే గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్, నాగల్‌కొండ, గాదిగూడ మండల కేంద్రంతో పాటు ఆద్మీయాన్ తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సర్వే నిర్వహించారు. ఇంటింటా సర్వేలో భాగంగా భగీరథ నీటి కనెక్షన్, యజమాని పేరు, ఆధార్ నెంబర్, నీరు వస్తుందా లేదా అనే వివరాలు సేకరించి మొబైల్ యాప్‌లో నమోదు చేశారు. సర్వేలో కార్యదర్శులు అనురాగ్, కోల శేఖర్, రవి కుమార్, యోగిరాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

- కార్పొరేట్ స్థాయిలో పాఠశాల భవనాలు
- అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో బోధన
- ఆటస్థలం..ఉచిత పాఠ్యపుస్తకాలు..దుస్తుల పంపిణీ
- బడిబాటతో మరిన్నీ ప్రయోజనాలు



నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, సౌకర్యాలున్నాయి. ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు దుస్తులను పంపిణీ చేస్తున్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో తరగతులను నిర్వస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటతో పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరుగుతుంది. ఇచ్చోడ మండలంలో ఎంపీపీఎస్ పాఠశాలలు 38, యూపీఎస్ పాఠశాలలు 07, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలు 5, కస్తూబా పాఠశాల 1, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ 1, తెలంగాణ సోషల్ వెల్ఫేర్1, ఆశ్రమ పాఠశాలలు 02, టీఎస్ డబ్ల్యూఈఆర్ఎస్ 02 పాఠశాలున్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో 77 పాఠశాలలో సుమారు 8238 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడం కోసం ఈనెల 6 నుంచి 19 వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నేటితో పూర్తి కాబోతోంది. దీని ముఖ్య ఉద్దేశం బడిఈడు పిల్లలను బయట ఉంచకుండా పాఠశాలలోనే చేర్పించడం. మండల కేంద్రంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో ఉన్న ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు.

అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యా బోధన

ప్రభుత్వ పాఠశాలలో అనుభవమున్న ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతుంది. విద్యార్థులకు సులువైన పద్ధతిలో విద్యాబోధన చేయడమే కాకుండా ప్రయివేట్ మాదిరిగానే స్లీప్, యూనిట్ టెస్టులు, వార్షిక పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను ఎప్పటికప్పుడు వాల్యుయేషన్ చేస్తూ విద్యార్థులు చేసిన తప్పిదాలను తెలుపుతున్నారు.

పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు రెండు జతల యూనిఫాం, నోటు పుస్తకాలు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది. దీనికి తోడు విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా మధ్యాహ్న భోజనం, ఉదయం అల్పహారం కూడా ఇస్తున్నారు.

క్రీడల కోసం ఆటస్థలం

చదువుతో పాటు మానసికోల్లాసం కోసం ఆటలు కూడా ఎంతో అవసరం. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలం ఉంది. ప్రతిరోజు ప్రభుత్వ పాఠశాలలో పీఈటీ ఉపాధ్యాయులు గేమ్స్ పీరియడ్‌లో ఆటలు ఆడిస్తున్నారు. ఆయా పాఠశాలల విద్యార్థులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడాల్లో రాణిస్తున్నారు.

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ విద్య

రాథోడ్ ఉదయ్ రావు, ఎంఈఓ, ఇచ్చోడ



బడిఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సంఖ్యను పెంచడం కోసం బడిబాట నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కంప్యూటర్‌తో పాటు ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుంది. డిజిటల్ ఎడ్యూకేషన్ కూడా ఇస్తున్నాం. పేద మధ్య తరగతికి చెందిన విద్యార్థులు తల్లిదండ్రులు రూ.వేలాతో ప్రయివేటుకు పంపంకుండా ఉచితంగా ఉత్తమ విద్యా బోధన దొరికే ప్రభుత్వ పాఠశాలకు పంపించాలి.

ఉద్యోగాలతో మెరుస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్

- నూతన బిల్డింగ్‌కు స్థలం కేటాయింపు
- ఇప్పటివరకు 213 మందికి ఉద్యోగాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుత పోటీ కాలంలో ప్రభుత్వ కొలువుతకు పోటీ పెరిగిపోయింది. ఒకప్పుడు వందల సంఖ్యలలో ఉద్యోగాలుంటే... పదుల సంఖ్యలో అభ్యర్థులుండేవారు. నేడు వందల సంఖ్యలో ఉద్యోగాలుంటే.. లక్షల సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇంట్లో చదువుకుందామంటే కొందరికి వీలు కాదు.. హైదరాబాద్ లాంటి ప్రధాన నగరాల్లో వెళ్లి కోచింగ్‌లు తీసుకుందామంటే.. ఆర్థిక పరిస్థితులు సహకరించవు. అలాంటి నిరుపేద అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ అండ ఉంటు బాసటగా నిలుస్తోంది. ఇక్కడ శిక్షణ తీసుకున్న అభ్యర్థులు ప్రభుత్వ కొలువుల్లో మెరుస్తు జీవితంలో స్థిరపడ్డారు. ఎస్సీ స్టడీ సర్కిల్ బోధన, సాధించిన విజయాలపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

శిక్షణలతో 213 మంది ఉద్యోగాలు

జిల్లా కేంద్రంలో 2016 సంవత్సరంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రారంభమైంది. స్టడీ సర్కిల్ ఏర్పడి నేటికి దాదాపు 8 సంవత్సరాలు పూర్తైంది. నాటి నుండి నేటి వరకు 800 వందల మందితో 8 ఫౌండేషన్ కోర్సుకు సంబంధించిన బ్యాచులు పూర్తి చేశారు. ప్రస్తుతం 9వ బ్యాచ్ కొనసాగుతుంది. ఇందులో శిక్షణ తీసుకున్న అభ్యర్థులు నాటి నుండి నేటి వరకు 213 మంది అభ్యర్థులు వివిధ ప్రభుత్వ కొలువులు సాధించారు. అలాగే గ్రూప్-4లో దాదాపు 8 మంది వరకు మెరిట్‌లో ఉన్నారు. ప్రస్తుతం స్టడీ సర్కిల్‌లో 5 నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సు జరుగుతుంది. మార్చ్ 18న ఈ కోర్సు ప్రారంభం కాగా ఆగస్టు 18 వరకు కొనసాగుతోంది. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి వందమంది అభ్యర్థులున్నారు. ఎస్సీ అభ్యర్థులకు 75 శాతం, ఎస్టీ అభ్యర్థులకు 10 శాతం, బీసీ అభ్యర్థులకు 10 శాతం సీట్ల కేటాయింపు చేశారు. ఉచిత శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు అనుభవజ్ఞులైన వారితో శిక్షణ అందిస్తున్నారు.

నూతన భవనానికి స్థలం కేటాయింపు

స్టడీ సర్కిల్ లో స్టడీ అవర్స్ సోమవారం నుండి శనివారం వరకు జరుగుతాయి. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయి. విద్యార్థులకు తాగునీరు, ఫర్నిచర్, టాయిలెట్స్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అద్దె భవనంలో స్టడీ సర్కిల్ కొనసాగుతోంది. ఇటీవల బదిలీ అయిన కలెక్టర్ స్టడీ సర్కిల్ కోసం బట్టి సవర్గం ప్రాంతంలో 2 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం నూతన భవన నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియ జరుగుతుంది.

అందుబాటులో హాస్టల్ సౌకర్యం

జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ తీసుకున్న వారు కొలువుల్లో రాణిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా నుండి అభ్యర్థులు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. ఎంపికైన పలువురు అభ్యర్థులకు ఇక్కడ ఉండడానికి హాస్టల్ సౌకర్యాన్ని అందుబాటులో తెచ్చారు. పురుషులు, మహిళాలకు వేరువేరుగా వసతి కల్పిస్తు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఇందులో 54 మంది యువకులు, 46 మంది యువతులు హాస్టల్‌లో ఉన్నారు. అభ్యర్థుల సామర్థ్యం తెలుసుకునేందుకు వీక్లీ పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులకు ఉచిత వైఫై, రుచికరమైన భోజనం, సండే, సండే అభ్యర్థుల ఉల్లాసం కోసం సినిమా ప్రదర్శన ఉంటుంది.

నిరుపేదలకు ఉపయోగం

-డా.రమేష్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్



ఆర్థికపరంగా ఇబ్బందులు ఉన్నవాళ్లకు స్టడీ సర్కిల్ ఉపయోగపడుతుంది. అభ్యర్థులకు హాస్టల్‌తో కూడిన శిక్షణ అందిస్తున్నాం. అభ్యర్థులు కొలువులు సాధించే లక్ష్యంగా పని చేస్తున్నాం. నిరుద్యోగులు ఈ స్టడీ సర్కిల్‌లో అందించే శిక్షణలను సద్వినియోగం చేసుకుంటు సర్కార్ కొలువుల్లో స్థిరపడాలి.

పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ఎంఈఓ జయశీల అన్నారు. విద్యారంగా ప్రత్యేక సంచిక సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. ఎంఈఓగా మూడు మండలాలకు ఇన్‌చార్జీగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. మూడు మండలాల్లో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు-156, ప్రయివేట్ పాఠశాలలు-88, కేజీబీలు-3, మోడల్ స్కూల్-1, మైనార్టీ రెసిడెన్షియల్స్-4, ఆశ్రమ పాఠశాలలు-9, మహాత్మా జ్యోతిభాపూలే-7, వాటి పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేస్తూ, ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు, పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేస్తున్నా. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవారిపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లతో పాటు యూనిఫామ్‌లు అందజేస్తున్నాం.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ప్రతిభ హైస్కూల్లో చదివే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ప్రధానోపాధ్యాయులు ఎస్.రాము అన్నారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు అత్యుత్తమమైన విద్యను అందిస్తున్నాం. పాఠశాలలో క్రీడలతో పాటు సాంస్కృతిక, సాంప్రదాయాలకు ప్రాధాన్యతను ఇస్తున్నాం. విద్యార్థులకు డ్రాయింగ్, చేతిరాత, చదివించడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి ఇంగ్లీషులో మాట్లాడటంలో మొదటి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఆరో తరగతి నుంచి ఐఐటి ఫౌండేషన్ తరగతుల వరకు నిర్వహిస్తున్నాం.

మొలకెత్తని పచ్చి రొట్ట విత్తనం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

జూన్ మొదటి నుంచి ఇప్పటి వరకు మండలంలో భారీ వర్షం కురువక పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఖరీఫ్ మొదట్లో ఆశించిన వర్షాలు కరిస్తేనే రైతులు సమయానికి విత్తనాలు వేసుకుంటారు. మృగశిర కార్తే దాటిపోతున్నా రైతులు ఈసారి సకాలంలో విత్తనాలు వేసుకోలేని దుస్థితిలో ఉన్నారు. వర్షం పడి వాతావరణం చల్లబడితే గాని పసుపు, పత్తి, మొక్కజొన్న తధితర విత్తనాలు విత్తుకునే అవకాశం ఉంటుంది. వాన కురిస్తే మొలకెత్తుతాయని భావించిన కొందరు రైతులు వరి పంటకు ఎరువుగా పనిచేసే పచ్చి రొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను దుక్కుల్లో చల్లుకున్నారు. 20 రోజుల నుంచి వర్షాలు లేక పోవడంతో అవి మొలకెత్తలేవు. సమయం దాటిపోతే పెరిగే పచ్చిరొట్ట పెరిగే అవకాశం లేక నష్టపోయే పరిస్థితి నెలకొన్నట్లు రైతులు వాపోతున్నారు. అడపా దడపా జల్లులు పడితేనే పచ్చి రొట్ట ఆశించిన స్తాయిలో పెరిగి వరిపంటకు ఎరువుగా పెరుగుతుంది. ఈ క్రమంలో పచ్చిరొట్ట విత్తుకున్న రైతులు వర్షంకోసం ఎదురుచూస్తున్నారు.

వాన పడకుంటే నష్టపోతాం


-కొక్కుల రాజారెడ్డి,రైతు శ్రీరాంనగర్



మూడెకరాల దుక్కిలో పచ్చి రొట్ట విత్తనాలు చల్లినాను. అప్పటి నుంచి ఒక వర్షం పడలేదు. ఆశించిన వర్షం పడితేనే వరి నాట్ల సమయానికి పచ్చి రొట్ట ఏపుగా పెరిగి మంచి ఎరువుగా పనిచేస్తది. వర్షం పడకుంటే విత్తనం సరిగా మొలకెత్తక నష్టపోతాం.


SMM GOLDEN LEAF SCHOOL
ICHODA, Dist: Adilabad, Cell: 7989519792
S.M.M
జిల్లాలోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు, నూతన విద్యా సంవత్సరం
శుభాకాంక్షలు
Achievers Are Not Born, They Are Created.
2024
ADMISSIONS NOW OPEN
PRESCHOOL
Play Group | Nursery | Jr Kg | Sr Kg
OUR FACILITIES
Safe & Secure Environment
Free Play Area
CCTV Surveillance
Nutrition Meals
ENROLL NOW
Limited Seats Available


Chemistry
RESONANCE ACADEMY
RESONANCE WORLD SCHOOL
WHERE LEARNING REDEFINED
Where Learning Redefined
H.No: 2-241/1, MAVALA, ADILABAD.
9959254517,9398330014, 6304842510
PRAMOD REDDY
- Msc, B.ed
DIRECTOR
INTERMEDIATE |NEET |IIT-JEE
(Residential |Semi Residential A/C Campus)
FEATURES & COURSES OFFERED
SUSHRUTA & SAMHITA an Exclusive Programme for NEET (BIPC)
VISISTA & ANSHRUTHA an Exclusive Programme for IIT (MPC)
Qualified & Experienced Faculty from HYD
Limited Strength in Each Section & Mentoring Sessions
Teaching on Senses Intelligent Interactive Panel
Micro Schedules & DPP'S
Online Tests
"Super 30" for LT NEET
ADMISSIONS ARE OPEN
Academic Year Start From 1st June
OUR TEAM
T. Lavanya Rajanala M.Sc., M.A., BEd (Principal) 15 Years of Excellence in Eductaion
D. Pramod Reddy (Chemistry) M.Sc., BEd Ex. Narayana & Sri Chaitanya 17 Years of Experience
G. Raghurami Reddy (Physics) M.Sc., BEd Ex. Narayana & Sri Chaitanya 16 Years of Experience
V. Ravi Kumar (Mathematics) M.Sc., BEd Ex. Narayana & Sri Chaitanya 15 Years of Experience
T. Krishna Chaitanya (Biology) M.Sc., BEd. Ex. Aakash 15 Years of Experience
S. Naresh Reddy (Chemistry) M.Sc., BEd. 12 Years of Experience
G. Sahadev (Chemistry) M.Sc., BEd. 15 Years of Experience
P. Padmaja (Chemistry) M.Sc., BEd. 14 Years of Experience
M. Mahesh (Physics) M.Sc., BEd. 12 Years of Experience
A. Madhukar Mathematics) M.Sc., BEd. 11 Years of Experience
Adviser: Dr. Ravi Sura Ph.D, M.S. (France & Switzerland) M.Sc., M.Tech (IIT Madras)
DAY / SEMI / RESIDENTIAL A/C CAMPUS
5 ACRES OF LAVISH GREEN CAMPUS
FIRST RATE EDUCATION
HANDS ON LEARNING
SMART TECHNOLOGY
INVENTIVE PROGRAM
IIT/NEET FOUNDATION
DYNAMIC TEAM WORK
SAFE & SECURE TRANSPORT


SRI VENKATESHWARA VIDYA MANDIR HIGH SCHOOL
Day & Residential (English Medium)
Bhuktapur, ADILABAD.
AN INSTITUTION FOR QUALITY EDUCATION
ADMISSIONS ARE IN PROGRESS
Classes : NURSERY to 10th
Bus Facility Available
34
Sri Venkateshwara Vidya Mandir High School
Behind Power House, Bhuktapur, ADILABAD.
For Details Contact :
9000591095, 9959271799
Tate Ashok Rao
Correspondent & Principal


జిల్లాలోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు, నూతన విద్యా సంవత్సరం
శుభాకాంక్షలు
మీ శ్రేయోభిలాషి
ఆదిలాబాద్


JUNIOR COLLEGE
(RECOG. BY GOVT. OF T.S.)
DAY & RESIDENTIAL
MPC, BIPC, CEC, HEC, & MEC (T/M & E/M)
The Best in District and the Town College....
VIDYARTHI
JUNIOR COLLEGE
DAY & RESIDENTIAL
RAVINDRA NAGAR, ADILABAD PH. : 08732-227042
DEGREE COLLEGE
(RECOG. BY GOVT. OF T.S.)
DAY & RESIDENTIAL
BSc (MPC & MPCS & Statistics) (BZC & BZCS) B.COM (COMP),B.A. (EPP) (T/M& EM)
Physics
Chemistry
Botany
Zoology
NCC
TARGETING JEE/NEET / EAMCET / CA-CPT/BOARD ?
Why Spend Lakhs ?
IT'S NOW TIME TO BREAK
Start your preparation with Vidyarthi Institution
Our Specialities
Well furnished four storeyed Own Building
Seperate Building for Inter and Degree College
Well-equipped library and labs
Well - experienced Regular Full time Lecturers
EAMCET Based Inter Education
Daily, Weekly & Monthly special tests
Daily Morning and evening study hours
Special Coaching to the educationally backward students
Hostel Facility Available seperate for Girls & Boys
Semi Residential for only Adilabad Town Students
Bus facility is available for local & Non-local students
Courses
MPC-EAMCET,IIT-JEE E/M
BPC-EAMCET, NEET E/M
MPC-IPE E/M & T/M
BPC-IPE E/M & T/M
MEC & CEC-IPE E/M & T/M
HEC-IPE T/M
జిల్లాలోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నూతన విద్యా సంవత్సరం
శుభాకాంక్షలు
హైస్కూల్ E/M
నర్సరీ - 10వ తరగతి వరకు
Admissions are in progress
MPC-II 963
BiPC-II 953
953 952 943 934 931 925
921 917 913
MPC-I 454
BiPC-I 429
448 447 447
427 427 424 423

యోగాతోనే ఆరోగ్యమైన జీవితం

నవతెలంగాణ-మంచిర్యాల

శారీరక, మానసిక సంపూర్ణ ఆరోగ్యానికి యోగాభ్యాసం సులువైన సాధనమని వనిత వాక్కు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షురాలు జ్యోత్స్న చంద్రదత్ అన్నారు. మంచిర్యాలలో గల ఎఫ్‌సిఐ భవనంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా డే సందర్భంగా పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థలు, యోగా గురువుల ద్వారా యోగాసనాలు వేశారు. యోగా ద్వారా అందరిలో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం, మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందని తెలిపారు. అందరూ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కవిత, సునీత, మంజుల, చందన, పద్మారెడ్డి, రేఖ పలువురు యోగా సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జీఎం

నవతెలంగాణ-మందమర్రి

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కుమార్ దీపక్‌ను శుక్రవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం ఏరియాలోని భూగర్భ, ఉపరితల గనులలో ఉత్పత్తి వివరాలను కలెక్టర్‌కు తెలిపారు. ఆర్అండ్ఆర్ సమస్యలపై కలెక్టర్‌కు తెలుపగా సానుకూలంగా స్పందించి సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



కలిసి పనిచేద్దాం..అభివృద్ధికి పాటుపడదాం..!

- విమానాశ్రయం కోసం భూమి అప్పగించాలి
- సూపర్‌స్పెషాలిటీలో వైద్యుల నియామకం కోసం తీర్మానం
- రోడ్లు, బడుల నిర్మాణాల్లో జాప్యంపై సభ్యుల ఆగ్రహం
- గరంగరంగా ఆఖరు జడ్పీ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేద్దామని..అంతిమంగా ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా కృషి చేద్దామని పలువురు ప్రజాప్రతినిధులు, సభ్యులు అన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అనేక గిరిజన ప్రాంతాల్లో రోడ్లు లేవని.. చెడిపోయిన వాటికి అటవీ అనుమతులు లేవనే కారణంగా కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ఊరు - మన బడి కింద చేపట్టిన బడుల నిర్మాణాల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటితో పలు అంశాలను సభలో ప్రస్తావించారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జడ్పీ ఛైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్,బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, కోవ లక్ష్మీ, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, జడ్పీ సీఈఓ రత్నమాల, సభ్యులు పాల్గొన్నారు.



విమానాశ్రయం కావాలి..వైద్యులు రావాలి

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అనేక ఏండ్లుగా ఊరిస్తున్న విమానశ్రయ నిర్మాణం అత్యవసరమని పలువురు సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. విమానశ్రయం కోసం ఇప్పటికే 369 ఎకరాల భూమి సిద్ధంగా ఉందని.. మరో 1500 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించాల్సి ఉందని పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ శాఖ త్వరగా ప్రతిపాదనలు పంపించాలని సూచించగా.. జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పందిస్తూ పది రోజుల క్రితమే సీఎం పేషీ నుంచి ఈ విషయమై ప్రతిపాదనలు అడిగితే పంపించామని తెలిపారు. మరోపక్క రూ.150కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరిగిందని..కార్పొరేట్ ఆస్పత్రుల్లో లేని పరికరాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. కానీ స్పెషలిస్టు వైద్యులు లేని కారణంగా సేవలు అందడం లేదని రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వైద్యుల నియామకాన్ని చేపట్టాలని కోరుతూ ఈ సభలో తీర్మానం చేద్దామని ప్రతిపాదించారు. మరోపక్క పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న ప్రధాన రహదారులను ఆర్అండ్‌బీకి అప్పగిస్తూ తీర్మానం చేసి రాష్ట్రానికి పంపిద్దామని..అక్కడ్నుంచి కేంద్రానికి వెళితే నిధులు విడుదలవుతాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.

బడుల నిర్మాణాల్లో జాప్యం..!

మన ఊరు - మనబడి కింద చేపట్టిన పాఠశాలల నిర్మాణాల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అవి పూర్తికాకుండానే తాజాగా అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట కొత్త పథకాన్ని తీసుకొచ్చారని వివరించారు. ఈ సందర్భంగా మన ఊరు - మనబడి కింద ఎన్ని పనులు పూర్తిచేశారు..ఇంకా ఎన్ని చేయాలో వివరాలు ఇవ్వాలని ఎంపీ నగేష్ టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారులను అడిగారు. వారి వద్ద సరైన సమాధానం లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉట్నూర్ మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట చేపడుతున్న పనుల్లో అనేక చోట్ల ప్రారంభం కాలేదని ఆ మండల ఎంపీపీ జైవంత్‌రావు తెలిపారు. సుంకిడి పాఠశాల సమస్యను అనేక సార్లు ప్రస్తావించినా పరిష్కరించడం లేదని మండల జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. యాపల్‌గూడ పాఠశాల నిధుల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని విచారణ జరిపించాలని ఎంపీపీ గంద్రత్ రమేష్ తెలిపారు. శిథిలావస్థకు చేరిన పాఠశాలలను కూలగొట్టాలని జైనథ్ ఎంపీపీ మార్శెట్టి గోవర్దన్ సూచించారు. మారుమూల ప్రాంతాల్లో టీచర్ల కొరత తీవ్రంగా ఉందని.. అనేక మంది మైదాన ప్రాంతాలకు వెళితే మారుమూల గిరిజన ప్రాంతాల్లో చదువులు ఎలా సాగుతాయని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రశ్నించారు. మరోపక్క అటవీ అనుమతుల పేరిట రోడ్ల నిర్మాణాలు చేపట్టడం లేదని పలువురు జడ్పీటీసీ, ఎంపీపీలు పేర్కొన్నారు. బోథ్ ఎక్స్‌రోడ్ నుంచి బోథ్ పట్టణం వరకు ఉన్న రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరితే అటవీశాఖ అనుమతి లేదని అధికారులు చెబుతున్నారని జడ్పీటీసీ సంధ్యారాణి పేర్కొన్నారు.

బోథ్ ఎక్స్‌రోడ్ వద్ద చేపట్టిన అర్బన్‌పార్కు నిర్మాణాల్లో లోపాలు ఉన్నాయని..నాసిరకం పనులు చేపట్టారని.. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గాదిగూడ మండలం ఖడ్కి దగ్గర బ్రిడ్జి మంజూరైనప్పటికీ అధికారులు పనులు చేపట్టడం లేదని జడ్పీటీసీ గంగుబాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులను అటవీ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు సభ్యులు తెలిపారు.

అభివృద్ధి లక్ష్యంగా పనిచేద్దాం : గోడం నగేష్, ఎంపీ

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేద్దాం. ప్రజల అభివృద్ధి అంతిమ లక్ష్యం కావాలి. జిల్లా అధికారులు సైతం ఇదే దిశగా కృషిచేయాలి. పనుల్లో జాప్యం జరగకుండా చూసుకోవాలి.విమానశ్రయం కోసం రాష్ట్ర ప్రభుత్వం 1500ఎకరాల భూమి అప్పగించాలి. ప్రజల ఆశలు, ఆశయాలను నిజం చేసేందుకు పాటుపడుదాం.

ఆ బ్యారేజీకి నిధులు కేటాయించాలి : పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సభలో సుదీర్ఘ చర్చ జరగాల్సిన అవసరం ఉంది. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు కృషిచేస్తాం. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలి. కోర్ట- చనాక బ్యారేజీ దాదాపు 80శాతం పూర్తయింది.కానీ కాల్వల నిర్మాణం కోసం భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే 50వేల ఎకరాలకు సాగునీరందించవచ్చు.

పోడు రైతులను ఇబ్బందులు పెట్టకూడదు : అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

జిల్లాలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులను అటవీశాఖ అధికారులు ఇబ్బందులు పెట్టకూడదు. అవసరమైన చోట్ల బోర్లు వేసేందుకు అనుమతివ్వాలి. నియోజకవర్గంలో అనేక మారుమూల ప్రాంతల్లో టీచర్ల కొరత ఉంది. కేటాయించేలా చర్యలు తీసుకోవాలి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి.

రోడ్ల పనుల్లో జాప్యం జరుగుతోంది : కోవ లక్ష్మీ, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

నియోజకవర్గంలో చేపడుతున్న పలు బ్రిడ్జిలు, రోడ్ల పనులు ఆగిపోయాయి. లోకారి వద్ద రోడ్డు పని అర్థాంతరంగా నిలిచిపోయింది. నార్నూర్,గాదిగూడ మండలాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. కెరమెరి నుంచి ఆదిలాబాద్ వయా ఆనార్‌పల్లి నుంచి వెళ్లే రోడ్డు పూర్తి కాకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.


సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు


ఎంపీ గొడెం నగేష్, కలెక్టర్ రాజర్షిషాకు సన్మానం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్, పక్కన ఎంపీ నగేష్

ఆ ఎద్దుపై దాడి చేసింది చిరుతే..!

- సీసీ కెమెరాలో రికార్డైన దృశ్యాలు



నవతెలంగాణ- తలమడుగు

మండలంలోని కుచులాపూర్- పల్సి(కె) గ్రామాల మధ్యలో రెండు రోజుల క్రితం ఎద్దుపై దాడి చేసింది చిరుత పులి అని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో అమర్చిన సీసీ కెమెరాలో చనిపోయిన ఎద్దును మళ్లీ తినడానికి వచ్చిన చిరుత దృశ్యాలు రికార్డు అయిన విషయాన్ని శుక్రవారం అధికారులు గుర్తించారు. దీంతో గత కొన్ని రోజులుగా మండలంలో అలజడి రేపుతోందని చిరుతేనని అధికారులు తేల్చారు. వివరాల్లోకి వెళ్తే కుచులాపూర్‌కు చెందిన జక్కుల ఆశన్నకు చెందిన ఎద్దు మేత కోసం అటవీ సమీపంలోకి వెళ్లింది. దీంతో చిరుత ఒక్కసారిగా ఎద్దుపై దాడి చేసి చంపేసింది. తొలుత పులిగా భావించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు వచ్చి చనిపోయిన ఎద్దును పరిశీలించి అక్కడి సమీపంలో సీసీ కెమెరా అమర్చారు. మరుసటి రోజున చిరుత ఎద్దు కళేబరాన్ని తినడానికి రావడం సీసీ కెమెరాలో రికార్డు కావడంతో చిరుతగా నిర్ధారించారు. మరోపక్క అంతకుముందు ఇదే మండలంలోని తలమడుగు గ్రామానికి చెందిన సత్యనారాయణకు చెందిన మేక కొత్తూరు చెరువు సమీపంలో మేత కోసం వెళ్లగా చిరుత దాడి చేసి నోట కరుచుకొని వెళ్లింది. ఇది గమనించిన మేకల కాపరి అరుపులు, కేకలు వేయగా విడిచిపెట్టి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. మరుసటి రోజున సైతం కొత్తూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మేకను సైతం తీసుకెళ్లే ప్రయత్నం చేయడం స్థానికంగా కలకలం రేపింది. వరుస ఘటనలో రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ చిరుతలు మహారాష్ట్ర అటవీ ప్రాంతం నుంచి ఇటువైపు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఆదివాసులకు అండగా ఉంటాం

- జోడేఘాట్‌ను సందర్శించిన ఎస్పీ శ్రీనివాస్



నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసీ గిరిజనులకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఎస్పీ డివి.శ్రీనివాస్ అన్నారు. ఆదివాసుల ఆరాధ్యదైవం, వీరుడు కుమురం భీం అసువులు బాసిన పోరుగడ్డను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ భీం నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి, సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జోడేఘాట్‌లోని మ్యూజియాన్ని తిలకించారు. మ్యూజియంలో భద్రపర్చిన పనిముట్లు, గిరిజన అలంకరణ ఆభరణాలు, గిరిజనులు వ్యవసాయంలో వాడే వస్తువులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుమురం భీం మనువడు సోనేరావుతో పాటు పలువురు గిరిజన నాయకులను శాలువాలతో సన్మానించారు. అనంతరం వారితో కలిసి అల్పాహారం తిన్నారు. ఆదివాసుల ఆచార, సంప్రదాయాలపై పరిశోధనలు చేసిన హైమన్ డార్ఫ్ దంపతులు నివసించిన మర్లవాయి గ్రామాన్ని సందర్శించారు. ఎస్పీతో పాటు డీఎస్పీ సదయ్య, ఎంపిపి పెందూర్ మోతీరాం, ఎస్సై గుంపుల విజయ్‌కుమార్, భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, గ్రామస్తులు మారుతి పాల్గొన్నారు.

ఓసీలో ఉద్యోగులు గైర్హాజరు దురదృష్టకరం

నస్పూర్ : ఉపరితల గనులలో వివిధ విభాగాల్లో ఉద్యోగాలు గైర్హాజరు కావడం చాలా దురదృష్టకరమని ఎస్ఓ టు జిఎం పురుషోత్తమరెడ్డి అన్నారు. జిఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి ఉపరితల గని, సెక్యూరిటీ విభాగాల్లో గైర్హాజరు ఉద్యోగులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఓ టు జిఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో 2023లో కనీసం వంద మస్టర్లు చేయని, 2024లో మే వరకు కనీసం 50 మస్టర్లు చేయని ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇప్పటి నుండి తప్పనిసరిగా ప్రతినెల 20 మస్టర్లు చేయాలని తెలిపారు. సంస్థలో ఉద్యోగం దొరకడం అందరి అదృష్టమని, ఉద్యోగులందరూ హాజరు శాతాన్ని పెంచుకోవాలని కోరారు. సింగరేణి సంస్థ చాలా సదుపాయాలు అందిస్తుందని, ప్రతి ఒక్కరు దాన్ని దృష్టిలో ఉంచుకొని విధులకు హాజరు కావాలని కోరారు. శుక్రవారం కౌన్సెలింగ్‌కు గైర్హాజరు ఉద్యోగులు 13మంది వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు, డీవైసీఎంఓ డాక్టర్ పి.రమేష్‌బాబు, డివైపిఎంలు రాజేష్, పాలకుర్తి రాజు, సీనియర్ పిఓ శంకర్ పాల్గొన్నారు.

తొర్రి చెరువు మరమ్మత్తుల పరిశీలన



సారంగాపూర్ : మండలంలోని ధని గ్రామ తొర్రి చెరువు మరమ్మత్తు పనులను శుక్రవారం బీజేపీ నాయకులు వడ్డే రాజేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువు తూముకు మరమ్మత్తులు లేక చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు ఎంఎల్ఎ మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. దీంతో మరమ్మత్తు పనులకు నిధులు మంజూరు చేయించారన్నారు. తూముకు షట్టర్లు బిస్తున్నారని, ఈ వర్షాకాలం ఆయకట్టుకు నీరందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఒలకరి చిన్నయ్య, వెంకటి గోపి, మల్లయ్య పాల్గొన్నారు.

బొగ్గు బావుల వేలంపై సీఐటీయూ నిరసన

నవతెలంగాణ-మందమర్రి

బొగ్గు బావులు వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బొగ్గు బావుల వేలం పాటలో మందమర్రి ఏరియా శ్రావణపల్లి ప్రాజెక్ట్‌ను వేలం పాటలో పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏరియాలోని గనులపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మద్దతుగా సీఐటీయూతో పాటు ఇతర కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండవలసిన జాతీయ సంపదైన బొగ్గును ప్రభుత్వ రంగ సంస్థలకు ఇవ్వకుండా ప్రయివేటు పెట్టుబడిదారులకు ఇస్తూ ప్రభుత్వ రంగానికి భవిష్యత్తు లేకుండా చేస్తున్న మోడీ విధానాలను కార్మికులు అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణ నుండి ఎన్నికైన పార్లమెంట్ సభ్యుడు బొగ్గు రంగానికి కేంద్ర మంత్రిగా ఉండి కూడా తెలంగాణలోనే వేలం వేస్తున్నారంటే ప్రజలు క్షమించరని అన్నారు. ఇదివరకే రాష్ట్రంలోని ఆరు బావులకు ఎక్స్‌ప్లోరేషన్ ద్వారా రూ.60కోట్లు ఖర్చు పెట్టారని తెలిపారు. పర్మిషన్లు ఇవ్వమంటే ఇవ్వకుండా పెండింగ్‌లో పెడుతూ ప్రయివేట్ వారికి కట్టబెడుతున్నారంటే బీజేపీ ప్రభుత్వ విధానమేమిటో కార్మికులందరూ అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణ బొగ్గు గనులను వేలంపాట లేకుండా సింగరేణికే కేటాయించాలని, లేదంటే భవిష్యత్తులో కార్మిక సంఘాలన్నింటిని కలుపుకొని 2021లో చేసినట్లు సమ్మె చేయడానికి సైతం వెనకడుగు వేయబోమని, దీనికి కార్మికులందరూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి వేలం పాటలో పాల్గొనమని చెబుతూనే కేంద్ర ప్రభుత్వానికి విన్నవిస్తామని చెబుతూ రెండు నాలుకల సిద్ధాంతాన్ని వదిలేసి సింగరేణికి బొగ్గు బావులు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. అవసరమైతే సింగరేణిలో వాటాదారులుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కొత్త బావులు కేటాయించకపోతే సింగరేణి భవిష్యత్తు ఏమవుతుందో గ్రహించాలన్నారు. సింగరేణిలో వచ్చిన లాభాల నుండి డివిడెంట్లు తీసుకోవడానికి చూపే ఉత్సాహం కొత్త గనులు కేటాయించడంలో ఎందుకు చూపెట్టడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్, ఉపాధ్యక్షులు వడ్లకొండ ఐలయ్య, సీనియర్ నాయకులు అల్వాల సంజీవ్, ఆర్గనైజర్లు జడల ప్రవీణ్, భేతి భరత్, వడ్లకొండ శివ, దెబ్బటి తిరుపతి, బుద్దె సురేష్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



మందమర్రి : దిష్టిబొమ్మ దహనం

నల్ల బ్యాడ్జీలతో నిరసన

కాసిపేట : మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు గనులను టెండర్ల ద్వారా ప్రయివేటు వారికి ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండిస్తున్నట్లు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే ఇవ్వాలని, గనులన్నింటిని ప్రైవేటు వారికి ఇస్తే సింగరేణిలో సుమారు 42000 మంది కార్మికులు, అధికారుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా రామగుండం వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ, మంత్రులు కిషన్‌రెడ్డి సింగరేణి జోలికి తాము రామని, రాష్ట్ర ప్రభుత్వం వాటా 51శాతం కాబట్టి సింగరేణి ప్రైవేటుపరం చేయమని చెప్పారని గుర్తు చేశారు. ఎన్నికల అనంతరం వేలం పాటకు తెర లేపారని, కేంద్రంలో బొగ్గు శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి వెంటనే బొగ్గు బావులను బడా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే విధానాన్ని మానుకోవాలని పేర్కొన్నారు. సింగరేణి సంస్థకే ఇవ్వాలని, లేనిపక్షంలో బొగ్గు గనుల కోసం కార్మికులు పోరాటాలు చేసి కాపాడుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చొప్పరి శ్రీహరి, రాజన్న, పి.రాజేందర్, ఆడెపు రవీందర్, కె.సంతోష్, కార్మికులు పాల్గొన్నారు.


కాసిపేట : నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

అంబేద్కర్ జాతీయ స్థాయి అవార్డుకు లక్ష్మణ్‌దాస్ ఎంపిక



నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త, స్వేరోస్ రాష్ట్ర నాయకులు, సింగరేణి ఉద్యోగి బన్న లక్ష్మణ్‌దాస్‌ను బహుజన సాహిత్య అకాడమీ అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు, అకాడమీ ఫౌండర్ డాక్టర్ నల్లా రాధాకృష్ణ హైదరాబాద్‌లో సంబంధిత పత్రాలు అందించారు. జూన్ 25న హైదరాబాద్‌లో 7వ జాతీయ సదస్సులో అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. విద్యా వ్యాప్తికి, ఈచ్ వన్ టీచ్ టెన్ కార్యక్రమం, హరితహారం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక అంశాలపై కృషికి అవార్డు ఇవ్వనున్నట్లు అకాడమీ నిర్వాహకులు తెలిపారు. అవార్డు పొందిన బన్న లక్ష్మణ్‌దాస్‌ను మాజీ మంత్రి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, బాదే వెంకటేష్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

టవర్ ఎక్కి గోపాల్ హల్చల్

నవతెలంగాణ-ఉట్నూర్

తన కుమారుడు రాథోడ్ సాయికుమార్(9) మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని శుక్రవారం తండ్రి రాథోడ్ గోపాల్ హల్‌చల్ చేశాడు. డీఎస్పీ నాగేందర్, ఎస్ఐ మనోహర్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ వేగవంతం చేసి నిందితులను త్వరగా పట్టుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గోపాల్ కిందికి దిగాడు.

వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్టాఫ్ నర్సులుగా విధులు నిర్వహిస్తున్న తమకు వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రిమ్స్ స్టాఫ్ నర్స్‌లు పేర్కొన్నారు. ఈ విషయంపై రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్



చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. శుక్రవారం వైద్య కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో విధుల్లో చేరినప్పటికీ ఇప్పటివరకు వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పునరవాస కేంద్రంలో మెరుగైన వైద్యం అందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పునరవాస కేంద్రంలోని రోగులకు సరైన సౌకర్యాలతో పాటు మెరుగైన వైద్యం అందించాలని, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ మెట్‌పల్లివార్ శ్రీధర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో డావ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోని మద్యపానం, మత్తు పదార్థాలను, పునరవాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక రోగి పూర్తి వివరాలను సంబంధిత ఫార్మాట్లలో నమోదు చేయాలని సూచించారు. ప్రతి వ్యక్తికి కౌన్సిలింగ్‌తో పాటు మెరుగైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ప్రతి రోగికి వ్యక్తిగత నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. మద్యపానం, మత్తు పదార్థాల అలవాట్లు మానేయడానికి యోగ, వ్యాయామం ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. ఈ సందర్భంగా ఆయన రోగుల వివరాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సాయం పొందుతున్న రోగులతో పాటు వారి బంధువులతో మాట్లాడారు వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట డాక్టర్ ప్రదీప్ సైకియాట్రిస్ట్ రిమ్స్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్ ఉన్నారు.

యోగాతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

- ఆసనాలు వేసిన కలెక్టర్, ఎమ్మెల్యే



ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుత కాలంలో ప్రతిమనిషి ఒత్తిళ్లతో జీవనం కష్టతరంగా మారుతోందని, నిత్యం యోగాసనాలతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని రెవెన్యూ గార్డెన్ ఎమ్మెల్యే పాయల శంకర్, అధికారులతో కలిసి ఆసనాలు వేశారు. యోగ గురువు తిరుపతి పలు ఆసనాలు వేయగా అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని అనుసరించారు. అనంతరం యోగ గురువు తిరుపతిరెడ్డి, రూపను సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రస్తుతం మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం యోగ చేయాలన్నారు. రోజు అరగంట పాటు యోగా చేస్తే దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉంటామని తెలిపారు. యోగను ప్రాచీనకాలంలో వైద్యంలో భాగం చేశారన్నారు. కానీ ప్రస్తుతం వాటిని ఎవరు పాటించడం లేదన్నారు. ప్రతి ఒక్కరూ యోగను తమ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.

యోగాతో క్రమశిక్షణ, ఏకగ్రతా అలవడుతుంది...

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ యోగ ప్రముఖ్యతను ప్రపంచ దేశాలకు తెలిపిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీదని తెలిపారు. యోగాతో క్రమశిక్షణ, ఏకగ్రతా అలవడుతుందని, భాతర ప్రత్యేకత, వైవిద్యాన్ని యోగా ప్రతిబింబిస్తుందన్నారు. సమాజంలో శాంతి నెలకొల్పేలా ప్రపంచ వ్యాప్తంగా యోగాకు ప్రధాని ప్రఖ్యాతి తీసుకువచ్చారని తెలిపారు. భారతదేశంతో పాటు అనేక దేశాలు యోగా సాధన చేస్తు ఆరోగ్యంగా ఉంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, అయూష్ వైద్యులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్‌లో యోగ దినోత్సవం...

ఇదిలా ఉంటే అటూ ఆఫీసర్స్ క్లబ్‌లో యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు వై.ఓంప్రకాష్ రెడ్డి, యోగ సాదకులు నగేష్ అసనాలు వేయగా, వాటిని శిక్షకులు అనుసరించారు. అనంతరం వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినిత, పద్మ అమృత, పార్వతి పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో అంతర్జాతీయ యోగడే దినోత్సవం..

మానవ జీవితం ఒత్తిడితో ఉంటుందని, వాటిని అధిగమించాలంటే ప్రతి ఒక్కరు యోగా సాధనలు చేయాలని జిల్లా ప్రధాన న్యామూర్తి ప్రభాకర్ రావు సూచించారు. జిల్లా కోర్టులో న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులతో యోగ గురువులు యోగా అసనాలను చేయించారు. యోగా వల్ల లాభాలను వివరించారు. అనంతరం యోగ గురువును సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ నిత్యం యోగ ద్వారా ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు దుర్గారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ పాల్గొన్నారు.

పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో...

పట్టణంలోని పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన యోగ దినోత్సవ వేడుకల్లో ఎస్పీ గౌస్ ఆలం పాల్గొన్నారు. యోగ గురువులు అసనాలు వేయగా పోలీసులు వాటిని అనుసరించారు. అనంతరం ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ పోలీసు విధులు ఒత్తిడితో ఉంటాయని, వాటిని అదిగమించేందుకు నిత్యం యోగ, వ్యాయమం చేయాలన్నారు. దాంతోనే ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. 24 గంటల విధులు నిర్వహించే వారికి యోగ ఎంతో తోడ్పటును అందిస్తుందని, మానసిక, శరీరక విశ్రాంతి ఉపశమనం, ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, చంద్రశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్‌లో 32(టి) ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో కళాశాలలో యోగ డే నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా కమాండింగ్ అధికారి వికాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగ శిక్షకులు నంద కిషోర్, ప్రజోత్ కుమార్ పాల్గొని యోగ ఉపయోగాలు వివరిస్తూ అందరితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత, ఏఎన్‌ఓలు కేర్ టేకర్‌లు చంద్రకాంత్, అశోక్, భూమన్న, టి.స్వప్న, ఎన్సీసీ క్యాడెట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా డే సందర్భంగా ర్యాలీ...

యోగా ద్వారా భారతదేశ కీర్తిని, సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పడం జరిగిందని, ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జై శ్రీరాం యోగా టీం ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించి పాల్గొన్నారు. యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిన్నారులు, నాయకులు ఉన్నారు.

నేరడిగొండలో...

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి యోగా చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానసికంగా ఎంతో ఉత్సాహంగా ఉంటామని, యోగ ప్రతి ఒక్కరూ చేయాలని ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. ప్రతి ఒక్కరికి ప్రపంచ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉట్నూర్ : పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ సుమన్‌బాయి, బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్ ఆధ్వర్యంలో శుక్రవారం తమ నివాసంలో యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాథోడ్ రితేష్ మాట్లాడుతూ యోగా గొప్పతనాన్ని భారతీయ సనాతన ధర్మాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్న నాయకుడు ప్రధాని అని అన్నారు. అనంతరం టీటీడబ్ల్యూఆర్ఈఎస్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి హస్నాపూర్ పీహెచ్‌సీ డాక్టర్లు యోగా చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మండల అధ్యక్షులు కొలిపాక రాజశేఖర్, బింగి వెంకటేష్, కాల్వ రవి, లింగాగౌడ్, సడిగె రాజేశ్వర్, గాలి శ్రీకాంత్, తన్నీరు సతీష్, విజయ్, డాక్టర్ ఈఫాత్, రాథోడ్ శ్రీనివాస్, లక్ష్మి, కుమారి, విజయలక్ష్మితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : రెండో బెటాలియన్‌లో శుక్రవారం ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఓం ప్రకాష్ రెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ట్రైనర్ 3 రోజులు యోగా శిక్షణ ఇచ్చి యోగా చేయటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కమాండెంట్ పీజేపీసీ ఛటర్జీ మాట్లాడుతూ శారీరక, మానసిక ఒత్తిళ్లను అధిగమించి, సంపూర్ణ ఆరోగ్యం సాధించేందుకు ప్రతీరోజు యోగా చేయాలని అన్నారు. తద్వారా క్రమ శిక్షణతో పాటు శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. జయరాజు, అడిషనల్ కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్‌లు, ఆర్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



నేరడిగొండ



ఆదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్‌టౌన్

మొబైల్ పోతే సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేయాలి

- పోగొట్టుకున్న పది ఫోన్ల అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మొబైల్ ఫోన్ పోతే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కానీ సీఈఐఆర్ వెబ్ పోర్టల్‌లో కానీ ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పోలీసు ముఖ్య కార్యాలయంలో గత మూడు నెలల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న పదిమంది బాధితుల మొబైల్ ఫోన్లను కనిపెట్టి తిరిగి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఇందులో రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు, బేలా పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు, మొత్తం 10 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు. మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని నేరస్తులు దొంగలించిన మొబైల్ ఫోన్లను దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉంటూ వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ డీసీఆర్బీ కే.సురేందర్‌రెడ్డి, సీఐలు కే.ఫణిదర్, శ్రీనివాస్, సైబర్ సెల్ సిబ్బంది సంజీవ్ కుమార్, రియాజ్, స్టేషన్ సిబ్బంది శరత్, రాంప్రసాద్, ఇస్మాయిల్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన బంజారా నాయకులు



నవతెలంగాణ-సారంగాపూర్

సారంగాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా శ్రీకాంత్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం మండల బంజారా నాయకులు ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు సకలాల్ నాయక్, జాదవ్ సురేష్, లక్ష్మణ్, డ్రా.శివరామ్, సకారాం, రాజు పాల్గొన్నారు.

ఉద్యాన పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులో ప్రవేశం కొరకు నోటిఫికేషన్ విడుదలైనట్టు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మురళి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిప్లొమా కోర్సులో 40 సీట్లలో ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పాలీసెట్‌లో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తుకు అర్హులని, ఇంటర్ ఫెయిల్ అయినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆఫ్ లైన్ విధానంలో దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందని, దరఖాస్తు ప్రక్రియ జూన్ 15 నుంచి ప్రారంభం కాగా, జులై 15 వరకు దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రిమ్స్ జూడాలు పేర్కొన్నారు. ఈ విషయమై శుక్రవారం రిమ్స్‌లో నల్ల దుస్తులు ధరించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి, మూడు రోజులైనా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విధులు నిర్వహిస్తూనే నిరసనలు కొనసాగించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు.

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని వామపక్ష విద్యార్థి యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ, పీవైఎల్, ఏఎస్‌యూ, పీడీఎస్‌యూ మాస్‌లైన్ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని కుమురంభీమ్ చౌక్ వద్ద మోకాళ్లపై కూర్చొని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజి ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంటర్మీడియట్ మార్కుల ఆధారితంగా వైద్య కళాశాలల్లో సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. హర్యానాలోని పరీక్షా కేంద్రంలో ఒకే గదిలో పరీక్ష రాసిన విద్యార్థుల్లో పక్కపక్కనే కూర్చున్న వారిలో 8 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం ఈ పరీక్షలో ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందా లేక మాస్ కాపీయింగ్ జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కొంతమంది విద్యార్థులకు గ్రేస్ ఇచ్చామని చెబుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఏ ప్రాతిపదికన గ్రేస్ మార్కులు ఇచ్చారో చెప్పకపోవడం పట్ల విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు.

అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టు వద్ద శుక్రవారం రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతంలోని మహారాష్ట్రలో పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న సమాచారం మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్టు వెల్లడించారు. చెక్‌పోస్టు నుంచి వచ్చి పోయే వాహనాలను తనిఖీలు చేశారు. వీరి వెంట స్థానిక ఎస్సై శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మడవి గణేష్, ఎఎస్‌యూ జిల్లా కార్యదర్శి సలాం వరుణ్, పీడీఎస్‌యూ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కుమ్ర అశోక్, పీవైఎల్ మెస్రం మారుతి, కనకే దత్తు, ఏఐవైఎఫ్ నాయకులు ఎంబడి నరేందర్ పాల్గొన్నారు.

పేదల కోసం అనేక పోరాటాలు చేసిన మాధవరావు

- విరాళాల సేకరణ కరపత్రాల విడుదల



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అగ్రవర్ణ కులంలో పుట్టిన మాధవరావు పేదల కోసం అనేక పోరాటలు చేశారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. శుక్రవారం సుందరయ్య భవనంలో బాసెట్టి మాధవరావు స్మారక కేంద్రం సీఐటీయూ జిల్లా కార్యాలయం నిర్మాణ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. అనంతరం విరాళల సేకరణ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ కార్మికుల పక్షాన పోరాటం చేసిన బాసెట్టి మాధవరావు పేరున సీఐటీయూ జిల్లా కార్యాలయ నిర్మాణాన్ని చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. అనేక వార్డుల్లో పేదలను కూర్చోబెట్టి స్థలాలు ఇప్పించారని తెలిపారు. ఆయన పేరున సీఐటీయూ జిల్లా కార్యాలయ నిర్మాణం చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ విరివిగా విరాళాలు అందించాలని కోరారు. 54 సంవత్సరాలుగా సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, అగ్గిమల్ల స్వామి, గంగన్న, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దర్శనాల నగేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పవర్ జితేందర్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పొచ్చన్న, మామిడి స్వామి, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సోనేరావు, వెంకట్‌రావు, ఇంద్రాజ్, ఆయా యూనియన్ నాయకులు బొజ్జ ఉశన్న, ఆత్మరాం, యశ్వంత్, రమేష్ పిప్పర్‌వాడ టోల్ ప్లాజా జిల్లా నాయకులు సంతోష్, రిమ్స్ నాయకులు రమాకాంత్, అరుణ్, రమేష్ పాల్గొన్నారు.

భావజాల వ్యాప్తికి ప్రొఫెసర్ జయశంకర్ కృషి

- ఘనంగా జయశంకర్ వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తికి కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ కలకాలం గుర్తుంచుకునే మహోన్నతమైన వ్యక్తి అని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను వివరిస్తూ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ తెలంగాణ కోసం బాల్యం నుంచి పరితపించిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. స్వరాష్ట్రం కోసం తొలి, మలి ఉద్యమాల్లో కీలకంగా పాల్గొన్నారన్నారు. జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో...

ఇదిలా ఉంటే అటూ విశ్వబ్రహ్మణ, స్వర్ణకార సంఘం నాయకులు ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ కోసం జయశంకర్ చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు నర్సిములు, ప్రధాన కార్యదర్శి మిసాల స్వామి, కోశాధికారి కొత్తపెల్లి దశరత్, అశోక్, పడగంటి కిష్టయ్య, గొలపెల్లి నర్సిములు, స్వర్ణకార సంఘం ఉదారి నగేష్, కార్యదర్శి సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామి, సంజయ్, శ్రీనివాస్, గోవర్ధన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

కాంగ్రెస్ ఆధ్వర్యంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పలువు కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. యువత జయశంకర్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుంకిడి ఎంపీటీసీ వెంకట్ యాదవ్, నలిమెల నవీన్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాగరాజు, రంజిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆచార్య జయశంకర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు జయశంకర్ తన జీవితాన్నే తెలంగాణ కొరకు త్యాగం చేశారని అన్నారు. తెలంగాణ సహకారంలో 60 సంవత్సరాలు నిరంతరంగా శ్రమించి దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు తెలంగాణ ఆవశ్యకతను తెలియజేశారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో భావ వ్యాప్తికి విశేష కృషి చేసి తెలంగాణను మనకు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ రాజేశ్వర్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బొల్లోజి నర్సయ్య, నాయకులు విలాస్, సాయన్న, భోజాగౌడ్, చిన్నయ్య, గంగాధర్ సంతోష్, రామ్ రెడ్డి, పోతన్న, భూమన్న, రాజన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.



ఉట్నూర్ : పట్టణంలోని కుమురంభీమ్ ప్రాంగణం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు రాజేష్ మాట్లాడుతూ జీవితాంతం తెలంగాణ స్వరాష్ట్రం కోసం కొట్లాడి తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తి కోసం కృషి చేసిన వ్యక్తి జయశంకర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో దూట మహేందర్, ముజీబ్, బాబాశ్యామ్, సాజిద్, సంతోష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | జూన్ 22, 2024 | www.navatelangana.com

బొగ్గు బ్లాక్‌ల వేలం ఆపాలి

నవతెలంగాణ-రెబ్బెన



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ల వేలం పాటను ఆపి, తెలంగాణలోని సింగరేణి బొగ్గు బ్లాక్‌లను యధావిధిగా వేలం లేకుండానే సింగరేణి సంస్థకే ఇవ్వాలని సింగరేణి కా లరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బెల్లంపల్లి ఏరియా ఖైరగూడ ఓపెన్ కాస్ట్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. బొగ్గు బ్లాక్‌లను వేలం వేయకుండా సంస్థకే అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు జూపాక రాజేష్, దివాకర్, నాయకులు అన్నం రాజ్‌కుమార్, గోపాల్ రామ్‌కిషన్, రవి, సత్యనారాయణ గౌడ్, సుధీర్, రాజు, టీబీజీకేఎస్ నాయకులు మారిన వెంకటేశ్వర్లు, వెంకటేశం, చంద్రశేఖర్, ఐఎన్టీయూసీ భాస్కర చారి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఏజెన్సీలో జీఓ 3 కొనసాగించాలి

నవతెలంగాణ-కెరమెరి



ఏజెన్సీ ప్రాంతంలో జీఓ 3ను కొనసాగించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలన్నారు. తెలంగాణలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలని, గిరిజనులకు పది శాతం రిజర్వేషన్ కల్పించాలని విన్నవించారు. వినతిపత్రం అందించిన వారిలో సేవాలాల్ సేన నాయకులు గుగులోతు రవి నాయక్, గజానంద్ నాయక్, రాథోడ్ రూప్‌లాల్ నాయక్, జరుపుల తిరుపతి, మోహన్, అజ్మీర తిరుపతి, రాథోడ్ రోహిదాస్ జాదవ్, నరేందర్ రాథోడ్, రమేష్ భానోత్, ఎంకటి పాల్గొన్నారు.

ఉప్పొంగిన సాంగ్వి ఒర్రె

- మూడు గంటలపాటు నిలిచిన రాకపోకలు



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని లెండిగూడ, పర్సువాడ, బోలపటార్, కేలీ(బీ), కేలీ(కె)తో పాటు పలు ప్రాంతంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సాంగ్వి గ్రామ సమీపంలోని ఒర్రెపై కల్వర్టు లేకపోవడంతో రోడ్డుపై నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహించింది. దాదాపు 3 గంటల పాటు నీటి ప్రవాహం తగ్గక పోవడంతో రాకపోకలు స్తంభించాయి. ఇరువైపులా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పరిసర గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు తిరుగు ప్రయాణంలో సాంగ్వి ఒర్రె ఉధృతంగా ప్రవహించడంతో మూడు గంటల పాటు ఒర్రె వద్ద నిరీక్షించక తప్పలేదు. ఒర్రెపై కల్వర్టు లేని కారణంగా ప్రతి ఏడాది ఇబ్బందులు తప్పడం లేదు. ఏండ్లుగా సాంగ్వి ఒర్రెపై కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని పరిసర గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

పోడు రైతులకు అండగా ఉంటాం



నవతెలంగాణ-రెబ్బెన

పోడు రైతులకు అండగా ఉద్యమిస్తామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోలేటి గ్రామపంచాయతీ సోనాపూర్ రెవెన్యూ గ్రామంలో ఆయన పర్యటించారు. ఇక్కడ 40 ఏండ్ల నుంచి ఎస్టీఎస్సీబీసీలు పోడు వ్యవసాయం చేస్తు జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఆ భూమి వాస్తవానికి ప్రభుత్వ అసైన్డ్ భూమి అని దానిని రెవెన్యూ అధికారులు ఫారెస్ట్‌కు అప్పగించినట్లు ఉందన్నారు. అటవీశాఖ అధికారులు ఎప్పుడు లేని విధంగా రైతులందరికీ నోటీలిచ్చి సాగు చేయొద్దని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సింగరేణి బొగ్గు గనికి స్వాధీన పరచడానికి అడ్డు లేకుండా రైతులను బెదిరించి భూములను స్వాధీనపర్చుకోవడానికి భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అటవీశాఖ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీబీసీలకు పోడు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించిందన్నారు. ఆయన వెంట పార్టీ అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, రైతులు మధుకర్ గౌడ్, పడాల శ్రీనివాస్, కాసర్ల సరస్వతి, జిట్టవేణి మహేష్, జటంగుల సాయి ఉన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకొని తిరిగి చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళా సంఘాలు తీసుకుంటున్న రుణాలు సద్వినియోగం చేసుకొని వాటిని సకాలంలో తిరిగి చెల్లించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ దేవరకొండ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజంపేట బ్యాంకులో 61 మహిళ సంఘాలకు రూ.నాలుగు కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కును బ్యాంకు రీజినల్ మేనేజర్ ప్రభుదాస్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఇదే సందర్భంలో రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. అప్పుడే బ్యాంకు అభివృద్ధి చెందడంతో పాటు రుణాలు అందించే సామర్థ్యం పెరుగుతుందన్నారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ బ్రాంచ్ మేనేజర్ విశ్వనాథం, కెరమెరి, వాంకిడి బ్రాంచ్ మేనేజర్లు శ్రీపాద్, విష్ణువర్ధన్ రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, మహిళా సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా వటసావిత్రి వ్రతం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో శుక్రవారం మహిళలు జ్యేష్ట శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని వట సావిత్రి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ, వాసవి నగర్‌తో పాటు పలు కాలనీలో మహిళలు వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి చెట్టు(వటవృక్షం)కు ప్రత్యేక పూజలు చేశారు. యమధర్మరాజును ఎదిరించి తన భర్త ప్రాణాలను కాపాడుకున్న సావిత్రి దేవి పతిభక్తికి గుర్తుగా పండగ జరుపుకుంటామని మహిళలు వివరించారు. సమాజంలోని అన్ని వర్గాలు క్షేమంగా ఉండాలని కోరుకున్నట్లు వారు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అన్ని కాలనీల మహిళలు పాల్గొన్నారు.



పీఈ సెట్‌లో మెరిసిన కేబీఎస్‌సీ విద్యార్థులు

- రాష్ట్రంలో 4, 7, 8 ర్యాంకుల సొంతం
- సత్తా చాటిన గిరిజన విద్యార్థినులు



ఆసిఫాబాద్‌లోని కుమురం భీం స్టడీ సర్కిల్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం 2019లో జిల్లా కేంద్రంలో గిరిజన విద్యార్థులకు పోటీ పరీక్షల్లో శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో అప్పటి ఎమ్మెల్యే ఆత్రం సక్కు కుమురం భీమ్ స్టడీ సర్కిల్ పేరుతో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉషన్న, రాజశేఖర్‌లను డైరెక్టర్లుగా నియమిస్తూ హాస్టల్ వసతి కల్పించి ఉచిత శిక్షణ ఇస్తున్నారు. అప్పటి నుండి ఇప్పటివరకు స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన వారిలో 8 మంది కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించగా, నలుగురు గురుకుల ఉపాధ్యాయులుగా, 18 మంది సీఆర్టీలుగా ఎంపిక కావడంతో పాటు శిక్షణ పొందిన వారిలో 73 శాతం మంది టెట్ ఉత్తీర్ణత సాధించారు. తాజాగా విడుదల చేసిన వ్యాయామ విద్య కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీజీపీఈ సీఈటీ)లో ఐదుగురు విద్యార్థినులు శిక్షణ పొందగా ఐదుగురు ఉత్తమ ర్యాంకు సంపాదించారు. డైరెక్టర్లతో పాటు పాలకమండలి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినుల సాధించిన విజయం వారి మాటల్లోనే.

విద్యార్థులకు మార్పులతో కూడిన విద్య

ఉషన్న, డైరెక్టర్



ప్రస్తుత పరిస్థితుల్లో పోటీ పరీక్షలు మారుతున్న విధానానికి అనుగుణంగా గిరిజన విద్యార్థులను ఎప్పటికప్పుడు సిద్ధం చేస్తున్నాం. దీనిలో భాగంగా గతంలోనే సీఆర్టీ, గురుకులం, కానిస్టేబుల్ ఉద్యోగాలు అనేక మంది విద్యార్థులు సంపాదించారు. ప్రస్తుతం వ్యాయామ విద్యలో ఐదు ర్యాంకులు రావడం సంతోషంగా ఉంది. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయిలో ఉండే విధంగా కృషి చేస్తున్నాం.

ఉత్తమ శిక్షణతోనే రాణించాను

జంగు బాయి, నాలుగో ర్యాంకర్



స్టడీ సర్కిల్ నిర్వహణ ఎంతో బాగుంది. ఇదే సందర్భంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. వ్యాయామ విద్య కామన్ ఎంట్రన్స్ పరీక్షకు వ్యాయామ ఉపాధ్యాయుడు రాకేష్ అందించిన శిక్షణ ఎంతగానో ఉపయోగపడింది. దీనితోనే నాలుగవ ర్యాంకు సాధించగలిగాను.

ఏడవ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది

రాజేశ్వరి, విద్యార్థిని



స్టడీ సర్కిల్ రావడానికి ముందు పోటీ పరీక్షలపై పెద్దగా అవగాహన లేదు. స్టడీ సర్కిల్‌కు రావడం డైరెక్టర్లు ఎప్పటికప్పుడు తనను వెన్నంటి ప్రోత్సహించడంతో ఏడో ర్యాంకు సంపాదించాను. పేదరికంలో ఉన్న తమలాంటి వాళ్లకు స్టడీ సర్కిల్ ఎంతో ఉపయోగపడుతుంది.

భవిష్యత్తులో మరిన్ని శిఖరాలు అందుకుంటాను

శిరీష, ఎనిమిదవ ర్యాంకర్



స్టడీ సర్కిల్లో నాకు దొరికిన ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకుంటాను. ఇప్పటికే ఎంతోమంది తమ అనుకున్న లక్ష్యాలు సాధించారు. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం లక్ష్యంగా స్టడీ సర్కిల్‌లో చేరాను. ప్రస్తుతం 8వ ర్యాంకు సంపాదించడం సంతోషంగా ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకు బాసటగా నిలవడమే నా లక్ష్యం.

ఈఎస్ఐ ఆస్పత్రిని తరలించొద్దు

- ఇన్‌చార్జి ఆర్డీని కోరిన సీపీఐ(ఎం), సంఘాల నాయకులు



ఇన్‌చార్జి ఆర్డీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ(ఎం), సంఘాల నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రిని ఇక్కడి నుండి తరలించవద్దని శుక్రవారం ఆస్పత్రికి వచ్చిన ఈఎస్ఐ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి రీజనల్ డైరెక్టర్(ఆర్డీ) జి.గాంగ్టేను పలు పార్టీలు, సంఘాల నాయకులు కోరారు. గురువారం సాయంత్రం ఇన్‌ఛార్జి ఆర్డీ గాంగ్టే కాగజ్‌నగర్‌కు వచ్చారు. ఆస్పత్రితో పాటు ఆవరణలో ఉన్న భవనాలు, ఖాళీ స్థలాన్ని కూడా ఆయన పరిశీలించారు. శుక్రవారం ఉదయం అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఈఎస్ఐ ఆస్పత్రిలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నంతరం పలు పార్టీలతో పాటు సంఘాల నాయకులు ఆయనను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. సీపీఐ(ఎం)తో పాటు సీఐటీయూ, సిర్పూరు పేపర్ మిల్లు టెన్ మెన్ కమిటీ నాయకులు వినతిపత్రాలు ఇచ్చి సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోయారు. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరిందనే సాకుతో ఇక్కడి నుండి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు. వేలాది మంది కార్మికులు ఈఎస్ఐలో భాగస్వాములుగా ఉన్నారని, దీనిని తరలిస్తే కార్మికులకు అన్యాయం చేసిన వారవుతారన్నారు. వైద్యుల పోస్టులతో పాటు సిబ్బందిని పూర్తి స్థాయిలో భర్తీ చేసి దీనికి పుర్వవైభవం తీసుకురావాలని కోరారు. కార్పొరేషన్ ఆస్తులు కూడా ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత కార్పొరేషన్ అధికారులకు లేదా అని ప్రశ్నించారు. ఆస్పత్రిని ఇక్కడి నుండి తరలిస్తే కోట్ల రూపాయల విలువైన ఈ స్థలాన్ని ఆక్రమించుకొని ప్లాట్లుగా చేసి విక్రయించుకోవాలని కొంతమంది నాయకులు ఎదురుచూస్తున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తాను కొత్తగా వచ్చానని, దీనిపై తనకు అంతగా అవగాహన లేదని ఇన్‌ఛార్జి ఆర్డీ సమాధానమిచ్చారు. పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు ఇచ్చిన సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముంజం ఆనంద్‌కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఎస్పీఎం టెన్ మెన్ కమిటీ సభ్యులు కె.శివకుమార్, రాజేందర్, అశోక్ కుమార్, గౌస్, లక్ష్మణ్ సింగ్ ఉన్నారు.

పాఠశాల పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-వాంకిడి

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులు కల్పించాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులకు ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలనలో భాగంగా శుక్రవారం మండలంలోని గాడ్‌జంగాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పనులను జిల్లా విద్యాధికారి అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పనులు తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలకు అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పాఠశాలకు మరుగుదొడ్లు కొంత దూరంగా ఉండగా వాటి దగ్గరికి వెళ్లడానికి నడకదారి నిర్మించాలని ఆదేశించారు. పాఠశాల పెయింటింగ్ పనులు ప్రారంభించి పూర్తిచేయాలన్నారు. జిల్లాలో జరుగుతున్న అన్ని పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ఆదర్శ పాఠశాల పనులకు నిర్దేశించిన గడువులోపు పూర్తిచేయాలన్నారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో ఉండాలన్నారు. విద్యార్థులకు మౌళిక వసతులు కల్పన నిర్లక్ష్యం వహించకూడదన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, అప్పుడే విద్యావ్యవస్థపై మరింత నమ్మకం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం మహేష్, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.



పాఠశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి లక్ష్మినరసింహం అన్నారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియగం-యువతపై ప్రభావం అనే అంశంపై అవగాహన కార్యక్రమంతో పాటు విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు కావద్దని సూచించారు. ఈ పోటీలలో విజేతలైన వారు జిల్లా స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. అధ్యాపకుడు డి.జనార్ధన్ మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జనార్దన్, వెంకటేశ్వర్లు, శారద, దేవేందర్, రోజ్‌మేరి, బి.వెంకటేశ్వర్లు, రాజేశ్వర్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఏను రద్దు చేసి అధికారులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ పరీక్షలు నిర్వహించడంలో విఫలమైన ఎన్టీఏను రద్దుచేసి అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని వామపక్ష విద్యార్థి సంఘ నాయకుల డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయి కృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి తిరుపతి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు నిలువుటద్దమైన జాతీయ పరీక్షలు ప్రస్తుతం డోలాయమానంలో కొనసాగుతున్నాయన్నారు. నీట్ పేపర్ లీక్, సీయూఈటీ పరీక్షల్లో తప్పులు, యూజీసీ నెట్ పరీక్ష నిర్వహించడంలో వైఫల్యంతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఎన్టీఏను రద్దు చేసి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థులకు ఇబ్బందులు పడుతుంటే ప్రధాని నరేంద్ర మోడీ కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పరీక్షలకు ముందు విద్యార్థులతో పరీక్షపై చర్చ నిర్వహించే ప్రధాని, విద్యావ్యవస్థను అపహస్యం చేసే విధంగా ఎన్టీఏ చేసిన విధానాలపై విచారణ జరిపించకపోవడం ఏంటాని ప్రశ్నించారు. విద్యా వ్యవస్థను పరీక్షలను కేంద్రీకృతం చేసి మతోన్మాదాన్ని పెంచే విధంగా దేశంలో పరిస్థితులు కొనసాగుతున్నాయని, విద్యార్థులు జాగ్రత్తగా ఉండి ఎదిరించే తత్వం అలవర్చుకోవాలన్నారు. ఎన్టీఏను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకొనే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వసాకె సాయికుమార్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు హరిశ్చంద్ర ప్రసాద్, రమ్యకుమారి, జీవన్, రాహుల్, సాయిరాజ్, సుధాకర్, రోహిత్, అరవింద్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు పురుషోత్తం, శ్రావణి పాల్గొన్నారు.

ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి చొరవ తీసుకోవాలి

- నీటి పారుదల శాఖ ఇంజనీర్ ఇన్ ఛీఫ్‌ను కోరిన బీజేపీ ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గంలోని కౌటాల మండలం తుమ్మిడిహేటి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి చొరవ తీసుకోవాలని నీటి పారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్‌ను బీజేపీ ఎమ్మెల్యేలు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన కార్యాలయంలో సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ కలిసి ప్రాణహిత ప్రాజెక్టు ఆవశ్యకత గురించి వివరించారు. ఈ ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరానికి తరలించడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలు ఎలా అన్యాయానికి గురయ్యాయో ఆయనకు వివరించారు. తుమ్మిడిహేటి వద్ద ప్రాణహితపై ప్రాజెక్టు నిర్మాణానికి చొరవ తీసుకోవాలని వారు కోరారు.

కొనసాగుతున్న బస్తీబస్తీకి డివైఎఫ్ఐ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాలనీలో ప్రజలు పడుతున్న కష్టాలు తెలుసుకోవడానికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్తీబస్తీకి డివైఎఫ్ఐ కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం మూడో రోజు మండలంలోని ఆర్‌ఆర్ కాలనీలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు తాగునీటి లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మురికి కాలువలకు మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. వీధి దీపాలు లేక రాత్రి కష్టాలు తప్పడం లేదన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడమే తమ లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి, యువకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | జూన్ 22, 2024 | www.navatelangana.com

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు

నవ తెలంగాణ-మందమర్రి



సింగరేణి సూపర్‌వైజర్లకు క్వార్టర్లను సీఈఆర్ క్లబ్‌లో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. మొత్తం 09 క్వార్టర్లకు గాను 12 దరఖాస్తులు వచ్చాయి. అధికారుల సమక్షంలో 03 క్వార్టర్లను కౌన్సిలింగ్ ద్వారా సీనియారిటీ ప్రాతిపదికన కేటాయించారు. పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు, డీజీఎం ఐఈడీ రాజన్న, డీవైపీఎం మైత్రేయ బంధు, ఆఫీస్ సూపరింటెండెంట్ రాయలింగు, ఎస్ అండ్ పీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావేదికకు అందరూ హాజరు కావాలి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై నిర్వహించే మండల స్థాయి ప్రజావేదికకు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఎంపీఓ రమేశ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోన్కల్ గ్రామపంచాయతీలో నిర్వహించిన సోషల్ ఆడిట్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. శనివారం జన్నారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ రాహుల్, ఉపాధి హామీ సర్వే అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సింగరేణి బొగ్గు బ్లాకుల వేలంపాట సరికాదు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గనుల వేలంపాట నిర్వహించడం సరికాదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)నాయకులు అన్నారు. శుక్రవారం హైదరాబాదులో పదవ బొగ్గు బ్లాకుల వేలంపాటలో తెలంగాణలోని శ్రావణపల్లి బ్లాకును వేలంపాటకు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అన్ని గనులపై నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులతో కార్మికులు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండవలసిన జాతీయ సంపదైన బొగ్గును ప్రభుత్వ రంగ సంస్థలకు ఇవ్వకుండా ప్రయివేటు పెట్టుబడి దారులకు ఇస్తూ ప్రభుత్వ రంగానికి భవిష్యత్తు లేకుండా చేస్తున్న మోడీ విధానాలు కార్మికులు అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణ నుంచి ఎన్నికైన ఎంపీ బొగ్గు రంగానికి కేంద్ర మంత్రిగా ఉండి కూడా తెలంగాణలోని బొగ్గు బ్లాక్ లను వేలం వేస్తున్నారంటే ఈ తెలంగాణ ప్రజలు క్షమించరని అన్నారు. ఇప్పటికే తెలంగాణలోని ఆరు బావులకు ఎక్స్‌ప్లోరేషన్ ద్వారా రూ.60 కోట్ల వరకు ఖర్చు పెట్టడం జరిగిందని, పరిమిషన్లు ఇవ్వమంటే ఇవ్వకుండా పెండింగ్‌లో పెడుతూ ప్రైవేట్ వారికి కట్టబెడుతున్నారంటే బీజేపీ ప్రభుత్వ విధానమేమిటో కార్మికులందరూ అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణ బొగ్గు గలను వేలంపాటలు లేకుండా సింగరేణి కేటాయించాలని, లేదంటే భవిష్యత్తులో అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని గతంలో 2021లో



చేసినట్లు సమ్మె చేయడానికి సైతం వెనకడుగు వేయబోమని కార్మికులందరూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణికి వేలం పాటలో పాల్గొనమని చెబుతూనే కేంద్ర ప్రభుత్వంకు విన్నవిస్తామని చెబుతున్న రెండు నాలుకల దోరణిని విడనాడి సింగరేణికి బొగ్గు బావులు ఇచ్చేలా కృషి చేయాలని అవసరమైతే సింగరేణిలో వాటా దారులుగా ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కొత్త బావులు కేటాయించకపోతే సింగరేణి భవిష్యత్తు ఏమవుతుందో గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అంబాల శ్రీనివాస్, నాయకులు కస్తూరి చంద్రశేఖర్, గని ఫిట్ సెక్రటరీలు పెరుక సదానందం, సందీప్, ప్రతాప్, మేల్లం శ్రీధర్, ఇప్ప నరేష్, మిడివెల్లి శ్రీనివాస్, తోడే సుధాకర్, సిరికొండ శ్రీనివాస్, ప్రవీణ్, నరేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో..

సింగరేణి బొగ్గు బ్లాక్ లను వేలంలో పెట్టే కేంద్ర ప్రభుత్వ మొండివైఖరి నశించాలని ఐఎన్టీయూసీ నాయకులు అన్నారు. శుక్రవారం ఐఎన్టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ శంకర్రావు ఆధ్వర్యంలో ఆర్కె 7గనిలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జాతీయ సమితి నాయకులు భీమ్ రావు, కేంద్ర నాయకులు పేరం రమేష్, తిరుపతి, ఏరియా సెక్రటరీలు వెంగల కుమారస్వామి, భూపతి అశోక్, నాయకులు వెంకన్న, ప్రేమ్ కుమార్, గని పిట్ సెక్రటరీ శ్రీకాంత్, నాయకులు ప్రణయ్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు గలను వేలం వేయటాన్ని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)గా వ్యతిరేకిస్తున్నామని డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఏరియా కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, సారయ్య ఫిట్ కార్యదర్శిలు లక్ష్మణ్, మోతె లచ్చన్న, దాడి రాజయ్య, గొల్లపల్లి రాంచందర్, వేణు పాల్గొన్నారు.

అధికారులంతా సమన్వయంతో పని చేయాలి



నవతెలంగాణ-తాండూర్

ప్రత్యేక అధికారుల పాలనలో అధికారులంతా మాజీ నాయకుల సహకారంతో సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. శుక్రవారం తాండూర్ ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. సర్పంచులు, ఎంపీటీసీలు పదవీ విరమణ పొందుతున్న తరుణంలో ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారులు వారి సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఖరీఫ్ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో వ్యవసాయ అధికారులు రైతులకు అండదండగా ఉండాలని తెలిపారు. వారి డిమాండ్ మేరకు విత్తనాలను ఎరువులను సరఫరా చేయాలని వ్యవసాయ అధికారి కిరణ్మయికి సూచించారు. డిమాండ్ ఉన్న విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల దృశ్య వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మలేరియా, డెంగు, అతిసార, కలరా వంటి వ్యాధులు సోకకుండా అప్రమత్తం కావాలన్నారు. గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. తొలకారి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయితీల్లో హరితహారం పనులు చేపట్టాలని సూచించారు. చెట్లను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. పోడు భూముల సాగు విషయంలో అటవీశాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సువర్ణకు సూచించారు. మహిళా సంఘాల అభివృద్ధికి చేయూతనందిస్తూ వారు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు లాభసాటిగా ఉండే పనులను చేపట్టాలని ఆయన ఏపీఓ నందకుమార్ కోరారు. అనంతరం విద్యుత్తు శాఖ ఏఈ ప్రభాకర్ పంచాయతీరాజ్ శాఖ ఏఈ విష్ణు పశువైద్యాధికారి పీపీ నరసింహారావు తమ నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ జడ్పీటీసీ బానయ్య సింగల్ విండో చైర్మన్ దత్త మూర్తి డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, హార్టికల్చర్ ఆఫీసర్ సుప్రజ, సుమన చైతన్య, పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ కోసమే ఆకస్మిక తనిఖీలు

- మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి

నవతెలంగాణ-మందమర్రి

శాంతి భద్రత పరిరక్షణ కోసమే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. వలస కార్మికులు పనిచేసే పరిశ్రమలను మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని పరిశ్రమలలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి పని చేసే కార్మికుల పూర్తి సమాచారం యాజమాన్యాల దగ్గర ఉండాలని, ఆయా రాష్ట్రాలలో వారి మీద నేర చరిత్ర ఏదైనా ఉన్నదా అని సమాచారం తెలుసుకోవాలన్నారు. పనిచేయడానికి వచ్చి పోయే కార్మికుల సమాచారాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. కార్మికులకు సరైన వసతులు కల్పించి వారి భాగోగులు చూసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. పరిశ్రమలలో ప్రదేశాలన్నీ కనబడేలా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. కార్మికులతో మాట్లాడుతూ ఎలాంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా జీవించాలని తెలిపారు. కార్మికుల పని ప్రదేశం, నివాస స్థలాలు, యాజమాన్యం కల్పించిన వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాధికారత సాధనంగా బీఐఎస్ యాప్

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

ప్రతినిత్యం మార్కెట్లో లభించే అన్ని రకాల ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలు తెలుసుకునేందుకు బీఐఎస్ కేర్ యాప్ వినియోగదారులకు సాధికారత సాధనంగా ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, బీఐఎస్ శాస్త్రవేత్త సుజాత, ఎస్పీఓ అభిసాయి ఇట్టలతో కలిసి నిత్య జీవితంలో వినియోగించే వస్తువులకు అందుబాటులో ఉన్న భారతీయ ప్రమాణాలు, నాణ్యతా పరీక్షలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారులు జిల్లాస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్లో మనం వినియోగించే అన్ని రకాల ఉత్పత్తులకు హాల్ మార్క్, ఐఎస్ఐ మార్క్ ప్రమాణాలతో హెచ్‌యూఐడీ సంఖ్యను కేటాయించడం జరుగుతుందని, మార్కెట్ లోని ఉత్పత్తులకు బీఐఎస్ అనుమతులు జారీ చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా భారతీయ ప్రమాణాలు నిర్ధారించే ఐఎస్ఐ ముద్ర ఉన్న వస్తువులు మాత్రమే కొనాలని తెలిపారు.

285 మంది రాత పరీక్షకు అర్హత

నవతెలంగాణ-నస్పూర్

ఈపీ ఆపరేటర్ ట్రైనింగ్ ప్రాక్టికల్ పరీక్షలకు శుక్రవారం 138 మందికి గాను 122 మంది హాజరయ్యారు. ఇందులో 77 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. జూన్ 18 నుండి ప్రారంభించిన ప్రాక్టికల్ పరీక్షలో మొత్తం 498 మంది హాజరవగా 285 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా జీఎం బి సంజీవరెడ్డి ప్రాక్టికల్ పరీక్షలను దిగ్విజయం చేసినందుకుగాను పరీక్షల కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం పురుషోత్తమ రెడ్డి, పరీక్షల పర్యవేక్షణ అధికారి అజయ్ కుమార్, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ శ్రీరాంపూర్ ఏరియా పి అరవింద రావు, ఐఈడి డీజీఎం చిరంజీవులు, డీజీఎం ఏరియా వర్క్ షాప్ రవీందర్ పాల్గొన్నారు.

బియ్యం దొంగల అరెస్టు

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైల్ నుంచి 23 బియ్యం బస్తాలను దొంగలించి అక్రమ రవాణా చేస్తున్న మంచిర్యాలకు చెందిన నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు రామగుండం రైల్వే ఇన్స్‌పెక్టర్ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. మంచిర్యాలలోని ఎఫ్‌సీఐ గోధంకు రైలు మార్గం ద్వారా వచ్చే బియ్యం బస్తలతో నిండిన గూడ్స్ రైలు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో ఆగడంతో గమనించిన నలుగురు వ్యక్తులు గూడ్స్ రైలు వ్యాగన్‌లోని బియ్యం బస్తాలను దొంగతనంగా కింద వేసి అనంతరం వాటిని మంచిర్యాలలో వారు ఏర్పాటు చేసుకున్న నివాస స్థలానికి తరలించారు. అదే క్రమం లో దొంగిలించిన బియ్యం బస్తాలను మార్కెట్‌లో అమ్మేందుకు వెళ్ళే సమయంలో రైల్వే కానిస్టేబుల్ ఐలయ్య, సుమన్‌లకు వచ్చిన విశ్వసనీయ సమచారం మేరకు గోపాల్‌వాడలో రహస్య నిఘా పెట్టినట్లు, అదే సమయంలో అటుగా బియ్యం బస్తాలను తరలిస్తున్న టాటా ఏస్ వాహనంతో పాటు యువకులను అదుపులోకి తీసుకోని విచారించగ నేరం ఒప్పుకోవడంతో వారిని రామగుండం రైల్వే మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద 23 బియ్యం బస్తాలతో పాటు రెండు ఆటోలను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు.

సీపీని కలిసిన కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్‌ను శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంచిర్యాల నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కుమార్ దీపక్, పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్షతో మర్యాదపూర్వకంగా కలిశారు.

అటవీ అధికారుల దౌర్జన్యం ఆపాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ళ ఆశయ్య



నవతెలంగాణ-జన్నారం

జిల్లాలో జన్నారం, దండేపల్లి ఇతర మండలాల్లో ఆదివాసి ఇతర పేదలు పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నా వారిపై అటవీ శాఖ అధికారుల దాడులు దౌర్జన్యాలు ఆపాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కొంతమంది ఆదివాసీల భూమిలకు అక్కుపత్రాలు వచ్చాయి. ఇంకా కూడా హక్కు పత్రాలు రావాల్సినటువంటి ఆదివాసీలు చాలామంది ఉన్నారు. కాని ఇటీవల తపాలాపూర్ గ్రామానికి చెందిన అత్రం రాజుపై అన్యాయంగా అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి జైల్లో వేస్తున్నారని విమర్శించారు. ఇతర ప్రాంతాల్లో కూడా అక్రమ కేసులు బనాయిస్తూ దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వీటిని వెంటనే ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోడు సాగుదారులపైన దౌర్జన్యం ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అక్కు పత్రాలు పొందినటువంటి భూములను ట్రాక్టర్లతోటి దున్నుకునే అవకాశం ఇవ్వాలని అదేవిధంగా కావాలి ప్రాంతంపై ఆధారపడి జీవిస్తున్నటువంటి అనేకమంది పేదలు, వెదురు బొంగులు తెచ్చుకోవడానికి మేధరి వృత్తిదారులకు అడుగు, అడుగున అడ్డంకులు లేకుండా చూడాలని కోరారు. అదేవిధంగా బ్యాంకు రుణాలు, హక్కు పత్రాలు, పోడు సాగుదార్లపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా పోడు వ్యవసాయం చేసుకున్నటువంటి ఆదివాసి ఇతర పేదలకు రక్షణ కల్పించాలని, అట్టి భూములను పేదలకే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 29, 30 తేదీలలో బెల్లంపల్లిలో నిర్వహించే సీపీఐ(ఎం) కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొండ గొర్ల లింగన్న, కార్యదర్శి కనికారం అశోక్, కుకటికారు బుచ్చయ్య, గుడ్ల రాజన్న, అబ్దుల్లా, అంబటి లక్ష్మణ్, మగ్గిడి జయ, దుర్గం లక్ష్మి, పోతు విజయ, ఆత్రం రాజు పాల్గొన్నారు.

ఆచార్య జయశంకర్ 14వ వర్ధంతి

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ సార్ 14వ వర్ధంతిని శుక్రవారం సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, మద్దినేని చిన్న భీమయ్య అంబేద్కర్ యువజన సంఘం మండల నాయకుడు దాసరి రాజన్న పూలు సమర్పించి నివాళ్లు అర్పించారు.

జన్నారం : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ జయశంకర్ వర్ధంతిని శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కడార్ల నరసయ్య, మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా జీవించిన మహానుభావుడన్నారు.



కస్తూరిబా పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జైపూర్

కోటపల్లి మండలంలో గల కస్తూరిబా పాఠశాలను చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సందర్శించారు. శుక్రవారం కోటపల్లి మండలంలో పర్యటించిన ఆయన కల్యాణలక్ష్మి, షాదీ ముబారఖ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాలను సందర్శించి స్థానికంగా ఉన్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోటపల్లి ఎంపీపీ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని మార్యదపూర్వకంగా కలిసిన స్థానిక ఎంపీపీ మంత్రి సురేఖ మండల పరిధిలో గల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని శాలువాతో సన్మానించారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

నవతెలంగాణ-మందమర్రి

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏరియా లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ ఏ సవిత మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రోజూ ఒక గంట సమయాన్ని కేటాయించి యోగ చేసినట్లయితే ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు క్లబ్ సెక్రటరీ శ్రీవాణి, ట్రెజరర్ కవిత, గేమ్స్ సెక్రటరీ ఊర్మిల, పాల్గొన్నారు.

జన్నారం : ప్రతిరోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు గుండవరపు మధుసూదన రావు అన్నారు. శుక్రవారం జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులతో కలిసి యోగాలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు రోజు యోగా చేయాలని సూచించారు. ఎంపీటీసీ కొంతం శంకరయ్య మోటివేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రకాష్ నాయక్ పాల్గొన్నారు.

నస్పూర్ : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని, యోగా చేయడంలో ప్రపంచ దేశాలకు భారతదేశమే ఆదర్శమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో సంజీవరెడ్డి ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ భారతదేశం యోగాకు పుట్టినిల్లని, హిమాలయ పర్వతాల్లో ఎంతోమంది మహనీయులు యోగా చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానంతరం ఉద్యోగులందరికీ పండ్లను పంపిణీ చేశారు. అలాగే శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కె-6 గనిపై గని మేనేజర్ తిరుపతి, ఎస్ఆర్పీ 3,3ఏ గనిపై మేనేజర్ సంతోష్ కుమార్, శ్రీరాంపూర్ ఉపరితల గనిలో ప్రాజెక్ట్



ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం పురుషోత్తమరెడ్డి, సీఎంఓ ఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, జనరల్ మేనేజర్ కార్యాలయం పిట్ కార్యదర్శి రామచందర్, డీజీఎంలు చిరంజీవిలు, అరవిందరావు, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, సీనియర్ పీఓ కాంతారావు, అకౌంట్ ఆఫీసర్ పద్మ సీనియర్, ఐటి ప్రోగ్రామర్ శ్రీనివాస్, యోగ గురువు సాంబయ్య పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని పల్లంగూడ ఉపాధి హామీ పని స్థలం వద్ద శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఈజీఎస్ అధికారులు, కూలీలు యోగసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ అధికారులు, సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగసనాలు వేశారు.

నస్పూర్ : తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్ల అర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా నాయకులు పొగాకు రమేష్, పానుగంటి సత్తయ్య, బండి రమేష్, వెంకట్‌రెడ్డి, రాజు నాయక్, తిరుపతిరెడ్డి, సంతోష్‌రెడ్డి, సల్మాన్, హరీష్ పాల్గొన్నారు.

జైపూర్ : 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎస్టీపీపీ ఓపన్ ఆడిటోరియమంలో మాస్ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ జనరల్ మేనేజర్ పీసీ బస్వీ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రతి ఒక్కరు యోగా అలవాటుగా మలచుకోవాలని కోరారు. ఉద్యోగులు తమ పని, దైనందిక జీవితంలో మానసిక, శారీరక ఒత్తిడికి గురువుతున్నారని పేఒ్కన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ సుధాకర్, ఏజీఎం(ఎఫ్‌జీడీ) ఎంఎన్‌వీ రమణ, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంఓఏఐ కార్యదర్శి సంతోష్ కుమార్, పర్సనల్ మేనేజర్ రామ శాస్త్రీ పాల్గొన్నారు.

శివ్వారంలో..

జైపూర్ మండలం శివ్వారం గ్రామంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామీణ ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశాలలో యోగ ఆసనాలతో అబ్బురపర్చారు.

భీమారంలో..

భీమారం ఎంపీడీఓ రాధ రాథోడ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమృత్ సరోవర్ వద్ద ఉపాధి హామీ కూలీలతో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో యోగా చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ఉపాధి హామీ ఏపీఓ జీనత్ పాల్గొన్నారు.



షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలోని లింగట్ల గ్రామానికి చెందిన మాడవి నాగోరావ్ ఇల్లు షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధం అయింది. దాదాపు రూ. లక్ష72 వేల నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారు జామున మంటలు ఎగిసిపడడంతో ఇంట్లో ఉన్నర నాగోరావ్ కుటుంబం గమనించి బయటకు వచ్చారు. వారి కేకలు విన్న చుట్టుపక్కాల వారు అక్కడి చేరుకొని మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ రాజ్‌వీర్, ఎంపీఓ లక్ష్మణ్, ఆర్ఐ నాగోరావ్ అక్కడి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం తహసీల్దార్ సంతోష్ రెడ్డి తక్షణ సాయం కింద 20 కిలోల బియ్యం అందించారు. ఆర్థిక సాయం కోసం పై అధికారులు విన్నవిస్తామని తహసీల్దార్ బాధితులకు భరోసా ఇచ్చారు. పీఏసీఎస్ మాజీ చైర్మెన్ నానక్‌సింగ్, గ్రామస్తులు బాధితులను పరామర్శించి ఆదుకోవాలని కోరారు.

విద్యుద్ఘాతంతో ఎద్దు మృతి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



విద్యుద్ఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని కొండపల్లి గ్రామపంచాయతీ పరిధిలోగల గొల్లవాడ గ్రామంలో జరిగింది. బొల్లెబోయిన భీమయ్య ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగకు తగిలడంతో విద్యుత్‌సరఫరా అయి ఎద్దు మరణించింది. విద్యుత్ శాఖ అధికారులు ఫార్మర్ గద్దెను ఎత్తు పెంచి కట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి రైతుకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి జైలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

లైంగికదాడి కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలుతో పాటు రూ. 20వేలు జరిమానా విధిస్తూ అసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంపీ రమేష్ తీర్పు ఇచ్చారు. ఆసిఫాబాద్ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన వివాహితతో వరుసకు మామ అయిన నిందితుడు చునార్కర్ ముకుందరావు మహిళ చేను పనిమీద వెళ్లిన ప్రతిసారి తన కోరిక తీర్చమని వెంటపడున్నాడు. ఒప్పుకోకపోయేసరికి వేరే వాళ్ళతో అక్రమ సంబంధముందని చెడు ప్రచారం చేస్తుండేవాడు. 2021 జనవరి 5న రాత్రి భర్త లేని సమయం చూసి ఇంట్లోకి ప్రవేశించి ఆమె చెయ్యి లాగి లైంగికదాడికి యత్నించాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేశ్వర్ కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టులో హాజరు పరిచి శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మహాగావ్, షెకుగూడ గ్రామ సమీపం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. సీఐ రహీమ్ పాషా తెలిపిన వివరాల ప్రకారం..నందాపటార్ గ్రామం కోర్పన తాలూకా చంద్రపూర్ జిల్లా మహారాష్ట్రకు చెందిన డోర్ ఖండే సునీత(45) శుక్రవారం నార్నూర్ మండలం కేంద్రంలో మైను బాబా దర్గా దర్శనం చేసుకున్నారు. తిరిగి తన గ్రామానికి కొడుకు రవితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. బైక్ అదుపు తప్పిపడడంతో సునిత తలకు గాయమై మృతి చెందింది. పంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రానికి చెందిన హాన్కటే మిలింద్(40) రాధాకృష్ణ మందిరం ఆవరణలో గల బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తాగుడుకు బానిస కావడంతో భార్య కొన్ని రోజులుగా దూరంగా ఉంటోంది. అప్పటి నుంచి తాగుడుకు బానిసై బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024-25 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర క్రీడా అకాడమీలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఆర్.రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో 4వ తరగతి చదువుతున్న బాల బాలికలకు ఎంపిక పోటీలుంటాయన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన 20 మంది బాలబాలికలకు జూలై 7, 8 తేదీలలో మేడ్చల్ జిల్లా హక్కింపేట్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయిలో ఎంపిక పోటీలుంటాయని, ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను రాష్ట్రంలో గల హకీంపేట స్పోర్ట్స్ స్కూల్, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని రీజనల్ స్పోర్ట్స్ స్కూల్స్ కేటాయించడం జరుగుతుందన్నారు. ధ్రువీకరణ పత్రాలతో పాటు ఐదు ఫోటోలతో పోటీలకు హాజరుకావాలని, ఇతర వివరాలకు 8008090626 నంబర్ సంప్రదించాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్టు ఎంపీడీఓ జవహర్ లాల్ సూపరింటెండెంట్ గంగాసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు నిర్వహించే సర్వసభ్య సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు పూర్తి ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గసభ్యులకు సన్మానం

నవతెలంగాణ-నేరడిగొండ

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను శుక్రవారం నేషనల్ క్రికెట్ కమిటీ సభ్యులు లఖన్‌సింగ్, పవన్, యోగేశ్వర్ దినేష్‌లు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

అదుపు తప్పి కారు బోల్తా

- ఒకరికి తీవ్రగాయాలు, ఐదుగురికి స్వల్ప గాయాలు



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర-మన్మథ్ రహదారిపై శుక్రవారం కారు అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుర గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తున్న క్రమంలో పొట్టిపెల్లి క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారులో 6 గురు ఉన్నారు. అందులో మహిళలు-2, పురుషులు-2, చిన్నారులు-2 ఉన్నారు. ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రేపు ఒలంపిక్ డే రన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 23న ఒలంపిక్ డే రన్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కన్వీనర్ పార్థసారథిలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7:00 గంటలకు రన్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని క్రీడా సంఘాల బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడా అభిమానులు సకాలంలో పాల్గొని, ఒలంపిక్ డే రన్‌ను విజయవంతం చేయాలని కోరారు.

వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న వర్షాకాలంలో వచ్చే ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావులతో కలిసి జిల్లా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో భారీ వర్షాలు పడి వరద పరిస్థితులు ఏర్పడే సందర్భాలలో గత అనుభవాల దృష్ట్యా అధికారులు సమన్వయంతో పనిచేసి అప్రమత్తంగా ఉంటూ ప్రజారక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని వాగులు, నదులు ప్రవహించే సమయంలో అకస్మాత్తుగా వరదలకు గురయ్యే గ్రామాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, ప్రజల సౌకర్యార్థం వెంటనే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆసిఫాబాద్ మండలంలోని గుండివాగు, కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి వంతెనల స్థితిగతులను పరిశీలించి తగు ఏర్పాటు చేయాలన్నారు. భారీ వర్షాల సమయంలో వాగుల వైపు ప్రజలు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా నీరు నిలువ లేకుండా ప్రత్యేక పారిశుద్ధ్య చేపట్టాలని సూచించారు. అందవెల్లి వంతెన నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ టీం తో మత్స్యశాఖ అధికారులు గజ ఈతగాళ్ళతో ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రయత్నం చేయాలని, ఎక్కడైనా స్తంభాలు వంగితే వాటిని సరిచేయాలన్నారు. ప్రజలకు తాగునీరు సరఫరా చేయడంలో ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. రవాణా సౌకర్యం లేని గ్రామాలపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి జిల్లాలో ఎలాంటి నష్టం జరగకుండా సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగ డే తెచ్చిన కష్టాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవనంలో శుక్రవారం నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకలు క్రీడా పాఠశాల విద్యార్థులకు కష్టాలు తెచ్చాయి. యోగ దినోత్సవంలో భాగంగా యోగా చేయడానికి ప్రతి ఒక్కరికి కింద వేసుకోవడానికి మ్యాట్లు వాడగా ముఖ్య అతిథలకు మ్యాట్ బదులు విద్యార్థులు బల్లలపై వాడే పరుపులు వేశారు. దీంతో పాటు పాఠశాలకు చెందిన కుర్చీలు కూడా వేడుకల కోసం తీసుకువచ్చారు. అయితే వేడుకలు పూర్తయిన తర్వాత తీసుకువచ్చిన వస్తువులు పక్కనే ఉన్న తమ పాఠశాలకు విద్యార్థులు మోసుకుంటూ వెళ్లారు. అయితే పాఠశాలకు చెందిన అటెండర్లు ఇతర కిందిస్థాయి సిబ్బంది చేయాల్సిన పనులు విద్యార్థులతో చేయించడంపై అక్కడే ఉన్నవారు ఖండించారు. వేడుకల పేరుతో విద్యార్థులతో పని చేయించడం విద్యార్థులు కూడా చేసేదేమీ లేక వస్తువులు మోసుకు వెళ్లడం కనిపించింది.

ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్తగా తెలంగాణ ప్రజల సాధికారత కోసం తన జీవితాన్ని సైతం అంకితం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన మహోన్నతమైన వ్యక్తి అని అన్నారు. ఆయన చూపిన మార్గంలో మనం నడవడం ద్వారా, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్ యాదవ్, నలిమెల నవీన్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగరాజు, రంజిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



జీఓ నెంబర్ 317 అప్పీలును వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-నార్నూర్

జీఓ నెంబర్ 317 అప్పీలును వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సుకొల న్యానేశ్వర్ అన్నారు. శుక్రవారం రాష్ట్రకమిటీ పిలుపు మేరకు గాదిగూడ మండలంలోని ఝరి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జితో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుడ్మెత సంగు, మడావి హనుమంత్, రాములు, అశోక్, సరస్వతి, సోంజీ ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, అతిసార ఇతర సీజనల్ వ్యాధుల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆహారం, తాగునీటిని తీసుకోవడంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో దోమలు వృద్ధి చెందకుండా నిరోధక చర్యలు చేపట్టాలన్నారు. ఇండ్లు, పరిసర ప్రాంతాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, వారంలో రెండు రోజులు డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రవాణా సౌకర్యాలు లేని గ్రామాలలో గర్భిణులను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని వారి బంధువుల ఇళ్లు, ఆస్పత్రులలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్, చేతి పంపులు, తాగునీటి బావులు, వాటర్ ట్యాంకులలో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

శరీర భాగాలను యోగ సమన్వయం చేస్తుంది

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శరీర భాగాలను యోగ సమన్వయం చేస్తుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ప్రపంచ యోగ దినోత్సవం పురస్కరించుకొన జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన అధికారిక యోగా దినోత్సవానికి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్, గిరిజన సంక్షేమ శాఖ క్రీడా అధికారి మీనారెడ్డి, ఏసీఎంఓ ఉద్ధవ్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా శరీర భాగాలను సమన్వయం చేస్తుందన్నారు. ప్రతిరోజు యోగా చేయడంతో అనేక రకాల ప్రయోజనాలున్నాయని తెలిపారు. గుండెకు రక్తం సరఫరా చేయడంలో ఉండే లోపాలు యోగాతో తొలగిపోతాయన్నారు. భారతదేశంలో ఉన్న యోగ ప్రాచుర్యాన్ని గుర్తించి అమెరికా, ఆస్ట్రేలియా లాంటి దేశాలు కూడా పాఠశాలల్లో యోగా తరగతులు నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుండి యోగ అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలో శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పతాంజలి యోగా ప్రచారక్ దొడాజీ, యోగా సాదకులు తిరుపతి, పుండిత్, రవి యోగాసనాలపై వివరించారు. అనంతరం అభ్యాసకుల చేత యోగాసనాలు చేయించారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా యోగా దినోత్సవాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ప్రతి ఒక్కరు యోగా చేస్తే ఆరోగ్యపరంగా ఉపయోగపడుతుందని, యోగా అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యోగా సాదకులు పాల్గొన్నారు.

రెబ్బెన : గోలేటి జీఎం కార్యాలయ ఆవరణలో పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఇన్‌చార్జి జీఎం ఎం.నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జీఎం మాట్లాడుతూ యోగా సాధనతో అనేక శారీరక రుగ్మతలు దూరం కావడంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. యోగ శిక్షకులు రాజలింగు, రాజ్యలక్ష్మి, చొక్కయ్యలు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఏజీఎం తిరుమల్ రావు, సీఎంఓఏఐ ఉపాధ్యక్షులు ఎం రమేష్, డీజీఎం రామారావు, ఏరియా సర్వే అధికారి చంద్రశేకర్ , సివిల్ ఎస్ఈ బాషా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో శుక్రవారం కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) నిర్వాహకుడు రాచకొండ నాగేష్, కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి అరుణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ సందేశాన్ని విద్యార్థులకు దృశ్య శ్రవణ రూపంలో వీక్షింపజేశారు. యోగ ఆవశ్యకతపై వివరించారు. యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, మానవ జీవితంలో ప్రతి ఒక్కరు యోగాతో పరిపూర్ణ జీవితాన్ని అనుభవిస్తారని, విద్యార్థులు ఇప్పటినుంచే యోగ పై శ్రద్ధ కనబరచాలని సూచించారు



ఆసిఫాబాద్



కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ : అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పటేల్ గార్డెన్‌లో భారత్ స్వాభిమాన్ పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో పదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పతంజలి భారత్ స్వాభిమాన్ ట్రస్టు జిల్లా ప్రభారి ఎం.రవీంద్రగౌడ్ యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగా గురువు దాసరి వినోద్‌గౌడ్ యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, రంగస్వామి, రఘురాం, దౌలత్, శివగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హితేష్ అగర్వాల్, ప్రకాష్ మాలి పాల్గొన్నారు.

న్యూట్రిషన్ ప్లస్ ఆధ్వర్యంలో...

అదేవిధంగా స్థానిక ఎస్పీఎం క్రీడా మైదానంలో న్యూట్రిషన్ ప్లస్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. న్యూట్రిషన్ ప్లస్ నిర్వాహకులు సుమిత్‌గుప్తా పలువురిచే యోగాసనాలతో పాటు ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యతను వారికి వివరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగ గురువులు వినోద్, దౌలత్ యోగ ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులతో ప్రాణాయామం, ఆసనాలను వేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మినరసింహం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తూడూరు దత్తాత్రేయ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజుతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్పీఎం ఆధ్వర్యంలో..

సిర్పూరు పేపర్ మిల్లు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా గురువు పోపట్‌తో పాటు సదాశివ యోగా అసనాలు వేయించారు. కార్యక్రమంలో యూనిట్ హెడ్ ఏకె మిశ్రా, జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి పాల్గొన్నారు.



వాంకిడి



రెబ్బెన



కాగజ్‌నగర్